



వేదికపై ఆశీనులైన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి



సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఏఎంజీ ఎంవోయూ

మరో ముందడుగు

- సర్కారుతో ఏఎంజీ మెటల్ ఒప్పందం
- రూ.44 వేల కోట్లతో పరిశ్రమ
- యు.కొత్తపల్లిలో ఏర్పాటు

ఈ పరిశ్రమలో ఏం చేస్తారంటే..

ఈ సంస్థ బాక్సైట్ ఖనిజం నుంచి తీసిన అల్యుమినాను ముడిపదార్థంగా ఉపయోగించి అల్యూమినియంను ఇంగోట్స్ రూపంలో తయారు చేస్తుంది. వీటిని కరిగించి ఐరన్ బిల్లెట్స్, వైర్ రాడ్‌లు, అల్యూమినియం షీట్లు, కాయిల్స్ వంటివి తయారు చేస్తారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

విశాఖ పెట్టుబడుల సదస్సులో కాకినాడకు భారీ పెట్టుబడి వచ్చింది. రూ.44వేల కోట్లతో ఏఎం గ్రీన్ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈమేరకు సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్ సమక్షంలో ఏఎం గ్రీన్ ఒప్పందంపై సంతకం చేసింది. పిఠాపురం నియోజకవర్గంలోని యు.కొత్తపల్లి మండలంలో ఈ కంపెనీ ఏర్పాటుకానుంది. కంపెనీ స్థాపనలో భాగంగా భూమి, భూ అభివృద్ధికి రెండు దశల్లో రూ.1800 కోట్లు, భవనాలు, ఇతర సివిల్ పనులకు రెండు దశల్లో రూ.2,950కోట్లు, ప్లాంట్, ఇతర యంత్రాలకు రెండు దశల్లో రూ.30,300కోట్లు, ఇంకా ఇతర ఖర్చులు కలిపి మొత్తం తొలిదశ కింద రూ.24,250 కోట్లు, రెండో దశ కింద రూ.19,750కోట్లు కలిపి మొత్తం రూ.44వేల కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు ఎంఓయూలో కంపెనీ పేర్కొంది. తొలి దశలో 0.5 మిలియన్ టన్నులు, రెండోదశలో 0.5మిలియన్ టన్నులు ఉత్పత్తి చేయనుంది. తద్వారా మొత్తం 3 వేల మందికి ఉపాధి కల్పించనుంది. ఇప్పటికే ఈ సంస్థ రాష్ట్రంలో రూ.50 వేల కోట్లతో పలు ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టింది. కాగా ఈ సంస్థకు ఇటీవల రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక పారిశ్రామిక ప్రోత్సాహకాలు ప్రకటించింది. ఎస్ఐపీబీ సిఫార్సుల మేరకు 250 ఎకరాల భూకేటాయింపునకు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఉత్పత్తికి సహకరించడంలో భాగంగా గ్రీన్‌కారిడార్ విధానంలో 2,500మెగావాట్ల విద్యుత్, నీటి అవసరాలు తీర్చేలా 17.2 ఎంఎల్‌డీ నీటి సరఫరా, భారీ పరిశ్రమ కేటగిరీలోకి చేర్చి అన్ని ప్రభుత్వశాఖల నుంచి అవసరమైన అన్నిరకాల అనుమతులు వేగంగా జారీచేయనుంది. ఇదే సంస్థ కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీ ప్లాంట్ ఏర్పాటుకు రూ.13వేల కోట్లు పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చింది.

గోవింద హారతి!





గోదావరి మాతకు హారతిస్తున్న ఆనంద తీర్థాచార్యులు, ఎమ్మెల్యే ముప్పిడి తదితరులు

టీటీడీ ఆధ్వర్యంలో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు శుక్రవారం రాత్రి మహా మంగళ హారతి అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చారు.. ఏడుకొండలవాడు.. భక్తజనం చెంతకు వస్తున్నాడంటే ఊరుకుంటారా.. ఆ స్వామిని చూసేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు.. ఎటుచూసినా భక్తజనమే.. కొవ్వూరు గోదావరి తీరమంతా భక్తజన సంద్రమైంది.. ఆ స్వామిని కన్నులారా చూసి.. మనసారా వేడుకున్నారు.. విశిష్ట పూజలు చేశారు. గోవిందా.. గోవింద నామస్మరణలతో గోష్పాద క్షేత్రం మార్మోగింది.. గోదావరికి గోవిందుడి హారతిచ్చారు. - 7లో

ఎన్నికలొస్తున్నాయ్!



స్థానికం..సమాయత్తం

జనవరిలో ఎన్నికలు..?

- ముందస్తు సన్నాహాలు
- ఓటర్ల జాబితాకు కసరత్తు
- పార్టీ శ్రేణులకు టీడీపీ పిలుపు
- అధికారులకు ఎస్ఈసీ లేఖలు
- 2026 జనవరిలోగా నోటిఫికేషన్
- అదే నెలలో ఫలితాలు

స్థానిక సంస్థల ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. గడువుకు ముందే ముందస్తు ఎన్నికల మోత మోగబోతోంది. పంచాయతీలు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఎన్నికల రణభేరికి సర్వం సిద్ధమవుతోంది. తాజాగా ఓటర్ల జాబితా సమగ్ర సవరణకు ఎన్నికల సంఘం కార్యాచరణ రూపొందిస్తోంది. మరోపక్క స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలంటూ కేడర్‌ను సైతం టీడీపీ సిద్ధం చేస్తోంది. దీంతో కొద్దిరోజుల్లో స్థానిక సంస్థల వేడి రాజుకోనుంది. - (కాకినాడ/ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏడాదిన్నరకు స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఉమ్మడి జిల్లాలో మొదలు కాబోతోంది. వాస్తవానికి వచ్చే ఏడాది మార్చి నాటికి మునిసిపాలిటీలు, నగర పంచాయతీలు, సర్పంచ్‌లకు ఐదేళ్ల పదవీకాలం పూర్తవుతోంది. మార్చి తర్వాత రాష్ట్ర ప్రభుత్వం తనకు నచ్చినప్పుడు ఎన్నికలు జరపొచ్చు. కానీ ప్రభుత్వం మాత్రం ముందస్తుకే మొగ్గు చూపు తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఏడాదిన్నరలోపే కూటమి సర్కారు అమలుచేసి జోష్ మీద ఉంది.ఈ సమయంలోనే ముందస్తు ఎన్నికలకు వెళ్లి విజయభేరి మోగించాలని భావిస్తోంది. ఎన్నికలకు కేడర్‌ను సన్నద్ధం చేస్తోంది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇటీవల అమరావతిలో పార్టీ జోనల్ కో ఆర్డినేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. పార్టీ నేతలు, క్యాడర్‌ను సమాయత్తం చేయాలని సూచించారు. ఎన్నికలకు సమాయత్తమయ్యే ప్రక్రియలో భాగంగా ఇప్పటికే పార్టీ పదవులు చాలావరకు భర్తీ చేశారు. అటు నామినేటెడ్ పదవుల పంపకం పూర్తిచేశారు.

స్థానిక సంస్థల గడువు ముగియడానికి మూడు నెలల ముందే వీటికి ఎన్నికలు నిర్వహించేలా రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలుపెట్టింది. మునిసిపాలిటీలు, పంచాయతీలకు వచ్చే ఏడాది జనవరిలో ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా కసరత్తు ప్రారంభించాలని ఆదేశిస్తూ పురపాలక, పంచాయతీరాజ్ శాఖలకు సెప్టెంబరులో లేఖ రాసింది. తాజాగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలకమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో) సన్నాహాలు మొదలుపెట్టారు. ఈనెల 6న అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. ఓటర్ల జాబితా సవరణకు వీలుగా సిబ్బందికి శిక్షణ ప్రారంభించబోతున్నారు. ఈనెలాఖరులోగా ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. డిసెంబరులో వార్డుల వారీగా ఓటర్ల జాబితాల ప్రచురణ, ఎన్నికల అధికారుల నియామకం, పోలింగ్ కేంద్రాల ఖరారు, ఈవీఎంలను సిద్ధం చేయడం, రిజర్వేషన్లు ఖరారు తదితర ప్రక్రియ పూర్తి చేయనున్నట్లు సమాచారం.జనవరి నెలాఖరులో ఎన్నికల నోటిఫికేషన్, అదే నెలలో ఫలితాల వెల్లడికి వీలుగా రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

2021లో ఎన్నికలు ఇలా..

ఉమ్మడి జిల్లాలో 2021 ఫిబ్రవరిలో 1,073 పంచాయతీల్లో నాలుగుదశల్లో 11,782 వార్డులకు 12,048 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు నిర్వహించారు.31 పంచాయతీలకు వివిధ కారణాలతో ఎన్నికలు జరగలేదు. కాకినాడ, పెద్దాపురం రెవెన్యూ డివిజన్ల పరిధిలో 366 పంచాయతీలకు తొలివిడత, రెండో విడత రాజమహేంద్రవరం, రామచంద్రపురం డివిజన్ల పరిధిలో 247 పంచాయతీలకు, మూడో విడత రంపచోడవరం, ఎటపాక డివిజన్ల పరిధిలో 186 పంచాయతీలకు, నాలుగో విడత కోనసీమలో 274 పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. అప్పట్లో మొత్తం ఓటర్లు 7,68,483గా తేలారు. వచ్చే ఏడాది జనవరిలో జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో వార్డులు, ఓటర్లు పెరగనున్నాయి.

పెరగనున్న వార్డులు..

ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీలు ఉన్నాయి. కాకినాడ, రాజమ హేంద్రవరంలో రెండు కార్పొరేషన్లు ఉన్నాయి. వీటన్నింటిలో వార్డుల విభజన నేపథ్యంలో వీటి సంఖ్య పెరగనుంది. కాకినాడ కార్పొరేషన్‌కు 2022 సెప్టెంబరుకు ఐదేళ్ల పదవీ కాలం పూర్తయినా మళ్లీ ఇప్పటివరకు ఎన్నికలు జరగ లేదు. ఇప్పుడు ఎన్నికలు జరిగితే ప్రస్తుతం ఉన్న 50 వార్డులకు అదనంగా మరో పది వార్డుల వరకు పెరిగే అవకాశం ఉంది. రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో శివారు గ్రామాల విలీనం సమస్య పరిష్కారమై పెరిగే వార్డులతో కలిపి ఇక్కడా ఎన్నికలు జరగనున్నాయి.

కొత్త వాళ్లకు చోటు..

2021 మార్చిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏడు మునిసిపాలిటీలు, మూడు నగర పంచాయతీల్లో కలిపి మొత్తం 268 వార్డులకు ఎన్నికలు నిర్వ హించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు చేరడంతో వీటి సంఖ్య తొమ్మి దికి చేరనుంది.అప్పట్లో చేతిలో అధికారం ఉండడంతో వైసీపీ అడ్డగోలుగా 35 వార్డుల్లో బలవం తపు ఏకగ్రీ వాలు చేయించింది.దీంతో 233 వార్డులకే ఎన్నికలు జరిగాయి. వార్డుల పునర్విభజన నేపథ్యంలో ఒక్కో మునిసిపాలిటీ, నగర పంచాయతీల్లో వార్డుల సంఖ్య మరింత పెరగనుంది. గత మునిసిపల్ ఎన్నికల్లో మొత్తం 655 మంది అభ్యర్థులు బరిలో నిలబడ్డారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో మరింత మంది పోటీ చేసే అవకాశం దక్కనుంది.



రావులపాలెం ఆర్టీసీ డిపోలో ఉచిత బస్సుకోసం ఎదురుచూస్తున్న మహిళా ప్రయాణికులు

మహిళా ప్రభంజనం

- ఫ్రీ బస్సులన్నీ కిటకిట
- జిల్లాలో ప్రయాణించిన 74.64 లక్షల మంది మహిళలు
- మూడు నెలలకు ఆర్టీసీపై రూ.22.20 కోట్ల భారం
- జిల్లాలో రావులపాలెం డిపోదే ప్రథమస్థానం
- కళకళలాడుతున్న బస్టాండ్లు, బస్సు సర్వీసులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

కూటమి ప్రభుత్వం ప్రారంభించిన స్త్రీశక్తి పథకంలో భాగంగా మహిళల ఉచిత బస్సు సర్వీసులన్నీ కిటకిటలాడుతున్నాయి. గత మూడు నెలల కాలంలో రికార్డు స్థాయిలో మహిళా ప్రయాణికులు ఉచిత బస్సు సర్వీసును వినియోగించుకున్నారు. మహిళల ఉచిత బస్సు సర్వీసును ఆగస్టు 15న ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించింది. ఇంతవరకు జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోల పరిధిలో 74.64 లక్షల మంది మహిళా ప్రయాణికులు ఉచిత బస్సును వినియోగించుకున్నారు. ఆర్టీసీ అధికారుల లెక్కల ప్రకారం రూ.22.20 కోట్ల మేర ఆర్టీసీ ఆదాయానికి గండిపడింది. అయితే గతంకంటే భిన్నంగా మహిళా ప్రయాణికులతో జిల్లాలోని ఆర్టీసీ బస్టాండులన్నీ కళకళలాడుతున్నాయి. ఏ స్టాప్ దగ్గర చూసినా మహిళలు బస్సుల కోసం ఎదురుచూడడం కనిపిస్తోంది. ఆర్టీసీకి ఆక్యుపెన్సీ పెరుగుతోంది. జిల్లాలోని నాలుగు ఆర్టీసీ డిపోల పరిధిలో మూడు నెలల కాలవ్యవధిలో 74,64,271 మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించారు. దీని ద్వారా రూ.22,20,96,975 సంస్థపై భారం పడింది. స్పందన అపూర్వం కావడంతో ఆర్టీసీ అధికారులు సైతం ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని బస్సుల సంఖ్యను పెంచారు. దీనిలో భాగంగా అత్యధికంగా జిల్లాలో అత్యధికంగా రావులపాలెం డిపో నుంచి 22,54,868 మంది అత్యధికంగా మహిళలు ప్రయాణికులు ఉపయోగించుకోవడంతో ఆర్టీసీపై రూ.6,91,21,081 భారం పడింది. అలాగే ద్వితీయస్థానంలో రామచంద్రపురం డిపో నిలిచింది. 22,42,719 మంది మహిళలు ప్రయాణించగా రూ.5,35,09,546 భారం పడింది. అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి 18,06,520 మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించడంతో రూ.6,88,32,163 భారం పడింది. రాజోలు ఆర్టీసీ డిపో నుంచి 11,60,167 మంది మహిళా ప్రయాణికులు ప్రయాణించడంతో రూ.3,06,34185 భారంపడింది. ఉచిత బస్సు సౌకర్యం ఆగస్టు 15న ప్రారంభంకాగా నవంబరు 13 వరకు జిల్లాలో మహిళలు ఈ సౌకర్యాన్ని ఉపయోగించుకున్నారని ప్రజా రవాణాశాఖ అధికారి ఎస్టీపీ రాఘవకుమార్ తెలిపారు. మొత్తం మీద మహిళల ఉచిత బస్సు సర్వీసుకు జిల్లావ్యాప్తంగా స్పందన అపూర్వం కావడంతో అధికారులు సైతం ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్న మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



శాంతి భద్రతల కమిటీ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

ఆలయాల్లో రద్దీ నియంత్రణ, భక్తుల భద్రతపై దృష్టిపెట్టాలి

శాంతి భద్రతల కమిటీ సమావేశంలో కలెక్టర్

అమలాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రముఖ దేవాలయాల్లో భక్తుల రద్దీ నియంత్రణ, క్యూలైన్ల ఏర్పాటు, శాంతి భద్రతల పరిరక్షణ వంటి అంశాలపై జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లో శాంతిభద్రతల కమిటీ సమావేశం జరిగింది. రెవెన్యూ, వైద్యులు, వలంటీర్లతో కలిసి సమన్వయంతో పనిచేయడం కీలకమని ఈ సందర్భంగా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. కార్తీకమాసం చివరి సోమవారం భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే శివాలయాల్లో భద్రత పటిష్ఠంచేయాలని, ఈనెల 26న సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా రాజోలు మండలం కడలిలో ఉన్న కపోతేశ్వరస్వామి ఆలయంలో షష్ఠి ఉత్సవాలకు పటిష్ఠ భద్రత కల్పించాలని ఆదేశించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తం కావాలన్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో నిఘా ఉంచాలని, ముందు జాగ్రత్తగా అంబులెన్సు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల తదితరులు పాల్గొన్నారు.

గ్యాంబ్లింగ్, గంజాయి, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ మీనా



అయినవిల్లి పోలీసుస్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

అయినవిల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్యాంబ్లింగ్, ట్రాఫిక్, గంజాయిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు. శుక్రవారం అయినవిల్లి పోలీసుస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలంతా పోలీసులకు సహకరించాలని, ఎక్కడ, ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. తద్వారా వాటిని అరికట్టడం జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్ఐ హరికోటిశాస్త్రిని మండలంలోని శాంతి భద్రతలు, గంజాయి, గ్యాంబ్లింగ్‌పై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్ కనెక్షన్ల జారీలో కొత్త విధానం : ఎస్ఈ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రాజేశ్వరి

అమలాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కనెక్షన్ల జారీలో ఏపీఈపీడీసీఎల్ కొత్త విధానాన్ని అమలులోకి తీసుకువచ్చినట్టు సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.రాజేశ్వరి తెలిపారు. శుక్రవారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు ఏపీఈపీడీసీఎల్ కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీ విధానాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు ఈజ్ ఆఫ్ లివింగ్ విధానాన్ని ప్రవేశపెట్టారన్నారు. కిలోమీటరు దూరానికి మించి ఉన్న ప్రాంతాలలోపు వారికి విద్యుత్ కనెక్షన్లు అందించే విధానాలను వివరించారు. దరఖాస్తు ఫీజు, సెక్యూరిటీ డిపాజిట్, ఇతర రుసుముల వివరాలు, నియమావళి ప్రకారం యథావిధిగా కొనసాగుతాయన్నారు. కిలోమీటరు లోపు ఉన్న వారి ఇళ్లకు ఎన్ని విద్యుత్ స్తంభాలు పడినా, వైర్లు పడినా ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందన్నారు. అనధికార లేఅవుట్లకు ఈ నిబంధనలు వర్తించవన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ విజయానంద్, డీఈఈ అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం ఎమ్మెల్యే ప్రజాదర్బారులో 133 అర్జీల స్వీకరణ

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన ప్రజాదర్బారు కార్యక్రమంలో స్వీకరిస్తున్న అర్జీల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రజాదర్బారు నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చినవారు రోడ్లు, డ్రెయిన్లు, ఇళ్లస్థలాలు తదితర అంశాలపై 133 అర్జీలు అందజేశారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, పొలమూరి ధర్మపాల్ తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చేందుకు .. అడ్డదారులు

స్కూటీలపై వెళ్లే మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్‌లు

నిందితుడి అరెస్టు.. 112 గ్రాముల బంగారు ఆభరణాల స్వాధీనం 7





» ఆకర్షణీయంగా.. ఆకట్టుకునేలా ఎసెస్‌మెంట్ బుక్‌లెట్ల రూపకల్పన
» సబ్జెక్టుల వారీగా అన్ని పరీక్షలకు ఒకే బుక్‌లెట్
» విడి పేపర్లపై పరీక్షలు రాసే విధానానికి స్వస్తి
» అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షల నిర్వహణ

పేపర్లు కాదు... సబ్జెక్టుల వారీగా ఇచ్చిన ఎసెస్‌మెంట్ బుక్‌లెట్లు

పుస్తకాలపైనే

ఇప్పటి వరకూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పరీక్షలు రాసేది పేపర్లపై. వాటిని ఏ పరీక్షకు ఆ పరీక్షకు ఇచ్చి వాటిని మూల్యాంకనం చేసి పక్కన పెట్టేవారు. ఇప్పుడు అలా కాదు ఆ విధానాన్ని పూర్తిగా మార్చివేశారు. సబ్జెక్టుల వారీగా అన్ని పరీక్షలకు కలిపి వేర్వేరు బుక్‌లెట్లును విద్యార్థులకు అందించి పరీక్షలు రాయిస్తున్నారు. దీనితో ప్రతి విద్యార్థి ప్రగతిని ఇట్టే ఉపాధ్యాయులు అవగాహన చేసుకునే వీలు ఏర్పడుతుంది. అదేవిధంగా పరీక్షల మార్కులను ఆన్‌లైన్ చేయనున్నారు.

(పిఠాపురం/గొల్లప్రోలు- ఆంధ్రజ్యోతి)

చిన్ననాటి నుంచి ప్రభుత్వ, మండల, మునిసిపల్, జిల్లాపరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పరీక్షలను విద్యార్థులు అప్పటికప్పుడు ఇచ్చే తెల్లకాగితాలపైనే రాసేవారు. ఈ విధానమే పీజీ వరకూ అమలులో ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్యారంగంలో వస్తున్న సంస్కరణల్లో భాగంగా ఇప్పటికే పాఠ్య పుస్తకాలను సమూలంగా మార్పు చేశారు. సెమిస్టర్ విధానాన్నీ అమలు చేస్తున్నారు. బోధనలోనూ కొత్త విధానాలు తీసుకువచ్చారు. సాధారణంగా ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకూ ప్రతి విద్యాసంవత్సరంలో ఫార్మటివ్ అసెస్‌మెంట్ (యూనిట్) పరీక్షలు నాలుగు జరుగుతాయి. క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ఫైనల్ ఎగ్జామ్స్ స్థానంలో సమ్మేటివ్ అసెస్‌మెంట్ 1,2 పరీక్షలను నిర్వహిస్తున్నారు. కొత్త విధానంలో మొదటి, రెండవ సెమిస్టర్లల్లో రెండు ఫార్మటివ్, ఒక సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు వంతున జరుగుతాయి. ఇప్పటికే రెండు ఫార్మటివ్ పరీక్షలు ముగియగా, ప్రస్తుతం సమ్మేటివ్ ఎసెస్‌మెంట్-1 పరీక్షలు జరుగుతున్నాయి.

అందంగా తీర్చిదిద్దారు

పరీక్షలు రాసే విధానంలో సమూల మార్పులు తీసుకువచ్చారు. విద్యార్థులపై ఒత్తిడి లేని రీతిలో పరీక్షలు పేపర్లపై కాకుండా అందంగా, ఆకర్షణీయంగా ఉన్న పుస్తకాలపై రాసేలా నిర్ణయించిన ప్రభుత్వం, నిపుణుల సలహాలతో అసెస్‌మెంట్ బుక్‌లెట్లును రూపొందించారు. 1నుంచి 10వ తరగతి చదివే ప్రతి విద్యార్థికి వారు చదువుతున్న తరగతులకు అనుగుణంగా ప్రతి సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ తయారుచేశారు. విద్యార్థులు అన్ని ఫార్మటివ్, ఎసెస్‌మెంట్ పరీక్షలను ఇందులోనే రాయాల్సి ఉంటుంది. వీటిని ఎప్పటికప్పుడు సంబంధిత క్లాస్ టీచర్ లేదా సబ్జక్టు టీచర్ మూల్యాంకనం చేసి అదే బుక్‌లో మార్కులు నమోదు చేస్తారు. కాకినాడ జిల్లాలోని అన్ని పాఠశాలలతోపాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాల్లో గల అన్ని ప్రభుత్వ, మునిసిపల్, మండల పరిషత్, కార్పొరేషన్, జిల్లా పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు సరిపడా బుక్‌లెట్లును అందజేశారు. ఇప్పటికే విద్యార్థులు రెండు ఎఫ్ఏ పరీక్షలను ఈ బుక్‌లెట్లుల్లో రాయగా, ప్రస్తుతం జరుగుతున్న సమ్మేటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలను ఇందులోనే రాస్తున్నారు. ఆకట్టుకునే రీతిలో ఉన్న ఈ బుక్‌లెట్‌లపై పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్షలు రాయగలుగుతారని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

ఎప్పటికప్పుడు విద్యార్థి ప్రగతిపై..

ప్రతి సబ్జెక్టుకు ఒక బుక్‌లెట్ ఇచ్చి దానిపైనే ఆ విద్యా సంవత్సరంలో పరీక్షలు అన్ని రాసే విధానం అమలులోకి తేవడంతో విద్యార్థుల ప్రగతిపై ఎప్పటికప్పుడు పరిశీలన చేసే అవకాశం ఉపాధ్యాయులు లభిస్తోంది. అదేవిధంగా ఈ బుక్‌లెట్‌ను విద్యార్థి అపార్ లేదా పెన్ ఐడీకి అనుసంధానం చేస్తున్నారు. ఈ అసెస్‌మెంట్ పరీక్షల మార్కులతోపాటు విద్యా సంవత్సరం చివరిలో ఇంటర్నల్ మార్కులు కూడా కలుపుతారు. ప్రతి పరీక్షకు మార్కులతోపాటు గ్రేడ్‌ను కూడా ఇస్తారు. విద్యాసంవత్సరం పూర్తైన తర్వాత సర్టిఫికెట్ ఆఫ్ అసెస్‌మెంట్ కంప్లీషన్‌ను విద్యార్థికి అందజేస్తారు. ఇలా ప్రతి సబ్జెక్టుకు సర్టిపికెట్లు ఇవ్వడం విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపుతాయని ఉపాధ్యాయులు తెలిపారు. బుక్‌లెట్లపై పరీక్షలు రాయడం ఆనందంగా ఉందని, ఇది తమ ప్రగతికి దిక్సూచిగా నిలుస్తుందని విద్యార్థులు చెప్పారు.





అంబాజీపేటలో ఏర్పాటు చేసిన వెచ్చని దుస్తులు.. జి.అగ్రహారంలో చలిమంట వేసుకున్న యువకులు

చలి పంజా

పెరిగిన చలిగాలులు

చలి తట్టుకొనేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

పల్లెల్లో వెలుస్తున్న ఉన్ని దుస్తుల దుకాణాలు

అంబాజీపేట,నవంబరు14(ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులతో శీతల గాలులు భారీగా వీస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి చలిగాలుల తీవ్రత పెరిగింది. రోజురోజుకి చలి తీవ్రత అధికమవ్వడంతో ప్రజలు చలికి విలవిలాడుతున్నారు. చలిగాలులు మున్ముందు ఎలా ఉంటాయోనని ఆందోళన చెందుతున్నారు. మరోపక్క చలి నుంచి రక్షించుకొనేందుకు ప్రత్యామ్నాయాలను ఆశ్రయిస్తున్నారు. అదే సమయంలో రగ్గులు, స్వెట్టర్లు అమ్మే ప్రత్యేక దుకాణాలు కూడా వెలుస్తున్నాయి. చలికాలం ప్రారంభమై నెలరోజులు కావడంతో చలిగాలులు క్రమేపీ పెరుగుతున్నాయి. ఉదయం ఏడు గంటల వరకూ చలి తీవ్రత అలాగే ఉండడంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పరిస్థితి ఇలా ఉంటే సాయంత్రం పరిస్థితి మరోలా ఉంది. ఆరు గంటల నుంచే వాతావరణం ఒక్కసారిగి మారిపోయి చలి తీవ్రత ప్రారంభమవుతోంది. అప్పటినుంచి ప్రారంభమైన చలిగాలులు రాత్రంతా కొనసాగుతున్నాయి. పల్లెల్లో సుమారు 22 నుండి 25 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రతలు తగ్గాయి. కనిష్ఠ దీంతో కనీసం బయటకు రాలేక గడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూలీ పనులకు వెళ్లే కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే మాలలు ధరించిన అయ్యప్ప, భవాని, శివమాలధారులు చలికి మరింత ఇబ్బంది పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వెచ్చదనం కోసం చలి మంటలను వేసుకుంటున్నారు. ఇప్పటికే ప్రజలు శీతాకాల ప్రభావంతో జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్నారు. చలి ఇలాగే కొనసాగితే మరిన్ని రుగ్మతలకు లోనయ్యే ప్రమాదం ఉంటుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో వెచ్చని ఉన్ని వస్త్రాలకు గిరాకీ పెరిగింది. ఈ సీజన్‌లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, నేపాల్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయడం మామూలే. ఈ ఏడాదీ ఈ వెచ్చని నేస్త్రాలను విక్రయించేందుకు పట్టణాలకు వచ్చారు. ప్రస్తుతం చలి పెరుగుతుడడంతో దుస్తుల అమ్మకాల సాగించేందుకు వ్యాపారులు ఇతర రాష్ట్రాల నుంచి గ్రామాలకు వచ్చి అమ్మకాలు సాగిస్తున్నారు. గతంలో అల్లికల స్వెట్టర్లను వినియోగించేవారు. ఇప్పుడు ఎక్కువగా యంత్రాలపై తయారుచేసిన ఉన్ని దుస్తులు ఆకర్షణీయంగా ఉండడంతో వాటిపైనే ఆసక్తి చూపుతున్నారు. చలితోపాటు వర్షం నుంచి రక్షణగా ఉపయోపడేలా తయారుచేసిన ఉన్ని దుస్తులకు డిమాండ్ పెరిగింది. చెవులకు కప్పే మంకీ క్యాప్‌లు, చేతులకు గ్లౌజులు, చిన్నారులను ఆకర్షించే టెడ్డీ బేర్ తరహా దుస్తులు, రగ్గులు, సోలాపూర్, దుప్పట్లు వివిధ ఆకర్షణీయమైన రంగు, బొమ్మలతో ముద్రించిన ఉన్ని దుస్తుల కొనుగోలుకు ప్రజలు మక్కువ చూపుతున్నారు. ఉన్ని వస్తువులు రకాలను బట్టి రూ.100 నుంచి రూ.2వేల వరకు వాటి ధరలున్నాయి.

83 రోజులపాటు శుక్రమౌఢ్యం

వివాహాది శుభ కార్యక్రమాలకు ముహూర్తాలు నిల్

బంగారం దిగివచ్చేనా..?

అమలాపురంరూరల్, నవంబరు14(ఆంధ్రజ్యోతి): బంగారం ప్రస్తావన లేకుండా ఏ శుభ కార్యక్రమం పూర్తికాని రోజులివి. ఇక వివాహ సమయాల్లో అయితే బంగారు ఆభరణాలకు ఇచ్చే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. బంగారు ఆభరణాలతో హుందాతనాన్ని ప్రదర్శించే రోజులివి. ఎన్నడూ లేనివిధంగా బంగారం ధరలు ఆకాశంలో చుక్కలనే దాటిపోయిందని చమత్కరిస్తున్నారంతా. రెండేళ్ల వ్యవధిలో రెట్టింపు అయిన బంగారం ధరలు తగ్గే అవకాశం ఉందా అన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతుంది. ఈ ఏడాది వివాహాది శుభ ముహూర్తాలకు ఇక రెండు రోజులే మిగిలి ఉంది. ఆ తరువాత 83 రోజులపాటు శుక్రమౌఢ్యం కావడంతో వివాహాది శుభ కార్యక్రమాలకు ముహూర్తాలు ఉండవు. దాంతో ఆ సమయంలోనైనా బంగారం ధరలు దిగి వస్తాయన్న ఆశాభావంతో పేద, మధ్యతరగతి ప్రజలు ఎదురు చూస్తున్నారు. పెరుగుట విరుగుట కొరకే అన్న సామెత బంగారానికి వర్తిస్తుందో లేదో వేచి చూడాల్సిందే. శుక్రమౌఢ్యం కారణంగా వివాహ, గృహప్రవేశ, శంకుస్థానల వంటి శుభ కార్యక్రమాలకు సుమారు మూడు నెలలపాటు బ్రేక్ పడిన నేపథ్యంలో బంగారం ధరలు తగ్గవచ్చునని వ్యాపారులు సైతం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది మే నెల నుంచి బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో వ్యాపారం అంతంతమాత్రంగానే ఉంటుందని చిరు బంగారు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దానికితోడు బడా వ్యాపార సంస్థలు బంగారం కొనుగోళ్లపై సైతం ఆఫర్లు ప్రకటించి చిరు వ్యాపారులకు కొద్దిపాటి వ్యాపారం కూడా లేకుండా చేస్తున్నారని వాపోతున్నారు. గతంలో ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది బంగారం ధరలు చుక్కలనంటాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.35లక్షలకు పెరిగింది. 22 క్యారట్ల బంగారం ధర రూ.1.21లక్షలకు పెరిగింది. ప్రస్తుతం బంగారం ధరల్లో ఎగుడుదిగుడులు కొనసాగుతూ కాస్తంత తగ్గి ప్రస్తుతం 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.27 లక్షల వద్ద ఉంది. 2023 నవంబరు నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.60వేలు ఉండగా ఈ ఏడాది ఇదే నెలలో రూ.1.27 లక్షలు ప్రస్తుతం ఉంది. అప్పట్లో 22 క్యారట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.55,400 కాగా ప్రస్తుతం రూ.1.17లక్షల వద్ద ఉంది. రానున్న శుక్ర మౌఢ్యమిలోనైనా బంగారం ధరకు కళ్లెం పడుతుందని అన్నివర్గాల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాగా బండారులంక సిద్ధాంతి కాలెపు భీమేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 26 నుంచి శుక్రమౌఢ్యం ప్రారంభమవుతుంది. ఈనెల 21 నుంచి డిసెంబరు 19 వరకు మార్గశిరమాసం. ఈ మాసంలో శంకుస్థాపనలు, గృహప్రవేశాలకు ముహూర్తాలు లేవు. ఈనెల 22, 23 తేదీల్లో వివాహాలకు ముహూర్తాలు ఉన్నాయి. ఈనెల 26 నుంచి శుక్రమౌఢ్యం ప్రారంభమై 2026 ఫిబ్రవరి 17 వరకు ఉంది. దాంతో 83 రోజుల శుక్రమౌఢ్యంలో వివాహాది శుభ కార్యక్రమాలు ఉండవని పేర్కొన్నారు.

వీఆర్వోలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు



కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రంతో పాటు మొక్క ఇస్తున్న వీఆర్వోల సంఘ ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల పరిధిలోని గ్రేడ్-1, గ్రేడ్-2 గ్రామ రెవెన్యూ అధికారులకు ఉద్యోగోన్నతి కల్పించాలని వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను కోరారు. శుక్రవారం ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రంతో పాటు మొక్క ఇచ్చారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఖాళీగా ఉన్న సీనియర్ అసిస్టెంట్ పోస్టులను గ్రేడ్-1 గ్రామ రెవెన్యూ అధికారులతో భర్తీ చేయాలన్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1గా ఉద్యోగోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సీనియర్ అసిస్టెంట్ ఉద్యోగోన్నతులకు సంబంధించి సీనియారిటీ జాబితాను ఈ వారంలోనే పబ్లిష్ చేసి ఉద్యోగోన్నతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలనాధికారి రామ్మోహన్‌రావుకు కూడా వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దాల బాపూజీ, సహాయ కార్యదర్శి అనిశెట్టి రామకృష్ణ, ప్రతినిధులు మేడిశెట్టి కిషోర్, సాధనాల యల్లేశ్వరరావు, అల్లాడి మల్లేశ్, శ్రీనివాసు, కె.స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ లిటరసీ సెంటర్లు ఏర్పాటు చేస్తాం

పిఠాపురంలో పైలట్ ప్రాజెక్టు

విశాఖ సీఐఐ సదస్సులో మురాలశెట్టి సునీల్‌కుమార్



పిఠాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తుతరాలకు సురక్షితమైన తాగునీరు, వ్యవసాయ, ఉద్యానవన పంటల సాగు, అక్వాకల్చర్‌కు పరిశుభ్రమైన సాగునీరు అందుబాటులో ఉండేలా చూసేందుకు వాటర్ లిటరసీ సెంటర్లను ఏపీలో నూతన ఆవిష్కరణగా ఏర్పాటు చేయనున్నట్టు గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్ వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో విశాఖపట్టణంలో నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో జాతీయ, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో వాటర్ లిటరసీ సెంటర్ల ఏర్పాటుపై శుక్రవారం ఆయన ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిని పైలట్ ప్రాజెక్టుగా పిఠాపురంలో చేపడతామని తెలిపారు. నీటి సంరక్షణ, సస్టైనబుల్ ప్రాక్టీసెస్, భూగర్భ జలాల నిర్వహణ, నీటి కాలుష్యాన్ని తగ్గించడం, నీటివనరుల పరిరక్షణ, టెక్నాలజీ ఇంప్లిమెంటేషన్, ప్లాస్టిక్ అండ్ ఇండస్ట్రియల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వర్క్‌షాపుల నిర్వహణ తదితర అంశాలను ఈ సెంటర్ చేపడుతుందని వివరించారు. సోషల్ మీడియా ద్వారా ప్రచారం, కళాశాల, పాఠశాల విద్యార్థులకు అవగాహన పెంచే విధంగా క్షేత్రస్థాయి పర్యటనల ఏర్పాటు, సర్టిఫికేషన్ కోర్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కాన్సెప్ట్ వినూత్నంగా ఉందని పలువురు ప్రతినిధులు అభినందించారు. తనకు అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు సునీల్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.



సహకార పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రామస్వామి

రైతుల సంక్షేమానికి కృషి చేయాలి

సహకార వారోత్సవాల ప్రారంభోత్సవంలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి

కాకినాడ రూరల్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి కోరారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను కాకినాడలోని డీసీసీబీ కేంద్ర కార్యాలయం వద్ద శుక్రవారం ఆయన ప్రారంభించారు. సహకార సప్తవర్ణ పతాకాన్ని ఆవిష్కరించి అధికారులు, సిబ్బందితో సహకార ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ డీసీసీబీకి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. చిన్న, సన్నకారు రైతులు, బడుగు, బలహీన వర్గాల శ్రేయస్సు కోసం సహకార వ్యవస్థ ఏర్పడిందన్నారు. సహకార వారోత్సవాలు దేశవ్యాప్తంగా సహకార ఉద్యమ అభివృద్ధికి నాంది పలుకుతాయన్నారు. ప్రతి సొసైటీ ప్రగతి పథంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహకార వారోత్సవాల జిల్లా ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వరరావు, డీజీఎం శ్రీధర్‌చౌదరి, డీసీవో శ్రీనివాస రెడ్డి, ఏజీఎంలు, మేనేజర్లు, అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా

పిఠాపురం

» 19 ఆలయాల అభివృద్ధికి రూ.20 కోట్లు
» కామన్ గుడ్ ఫండ్ నిధుల విడుదలకు దేవదాయ శాఖ అంగీకారం
» అందులో పాదగయ క్షేత్రానికి రూ.6 కోట్లు, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం అభివృద్ధికి రూ.2 కోట్లు కేటాయింపు



పాదగయ క్షేత్రం



ప్రణాళికను వేగవంతంగా అమలు చేయాలి:

డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, పాడా అధికారులతో సమీక్ష

పిఠాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్టాన దేవత అయిన పురుహూతికా అమ్మవారు, స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, శ్రీపాదశ్రీవల్లభులు పుట్టిన పిఠాపురాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా రూపుదిద్దేందుకు ప్రణాళికను వేగవంతంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. పాదగయ క్షేత్రం, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం తదితర ప్రధాన ఆలయాలతో పాటు 19 దేవాలయాల అభివృద్ధికి సీజీఎఫ్ నిధులు రూ.20 కోట్లు విడుదల చేసేందుకు దేవదాయ శాఖ అంగీకరించిందని వెల్లడించారు. పవన్‌కల్యాణ్ శుక్రవారం మంగళగిరిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, పిఠాపురం పాడా అధికారులతో సమీక్ష నిర్వహించారు. కుక్కుటేశ్వరస్వామి, పురుహూతికా ఆలయాల అభివృద్ధికి రూ.6కోట్లు వెచ్చించనున్నామని, ఈ నిధులతో పిండప్రదాన మందిరం, అన్నదాన మండపం నిర్మాణంతో పాటు పాదగయ పుష్కరిణి మరమ్మతులు చేపడతామని వివరించారు. ఈ పనుల నిర్వహణకు దేవదాయ శాఖ ఆమోదం లభించిందన్నారు. శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం అభివృద్ధికి రూ.2కోట్లు మంజూరయ్యాయన్నారు. సీతారామాంజనేయ స్వామి ఆశ్రమం అభివృద్ధికి రూ.60లక్షలు, జైగణేష్ ఆలయ అభివృద్ధికి రూ.65లక్షలు, చిత్రాడలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.70లక్షలు వెచ్చించనున్నామని చెప్పారు. పురుహూతికా అమ్మవారు, కుక్కుటేశ్వరస్వామి ఆలయాలు, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రాజెక్టు తయారు చేస్తున్నట్టు తెలిపారు. టెంపుల్ టూరిజంలో భాగంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

పిఠాపురం మండలం నవఖండ్రవాడలోని నక్కుళ్లమ్మ ఆలయం, రామాలయం, గొల్లప్రోలులోని సిరితల్లి ఆలయం, తాటిపర్తిలోని మార్కండేయ సమేత భద్రావతి భావనారుషి ఆలయాలను ధూప, దీప, నైవేద్యం పథకం పరిధిలోకి తీసుకునేందుకు దేవదాయ శాఖ అంగీకారం తెలిపిందన్నారు. సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచే ఆలయాల పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. నిధుల మంజూరు అంగీకారం తెలిపిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి పవన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్తీకం చివరి సోమవారం, మాసం ముగిసే రోజున భక్తుల తాకిడి అధికంగా ఉంటుందని, అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు పటిష్టంగా ఉండాలని సూచించారు.

వాడపల్లి వెంకన్న ఆలయానికి రెండు బ్యాటరీ కార్లు

బహూకరించిన విక్టరీ సంస్థ అధినేత వెంకటరెడ్డి



బ్యాటరీ కారును ప్రారంభించిన అనంతరం స్వయంగా నడుపుతున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం రావులపాలేనికి చెందిన విక్టరీ సంస్థ అధినేత గొలుగూరి వెంకటరెడ్డి రూ.20లక్షలతో రెండు బ్యాటరీ కార్లను కొనుగోలు చేశారు. వీటిని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు శుక్రవారం ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే, దాతలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఈ వాహనాలను వినియోగిస్తామని దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అనంతరం గ్రామంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, దాతలు పాల్గొన్నారు.

పిల్లలకు సనాతన ధర్మం నేర్పించాలి

● దాస సాహిత్య ప్రాజెక్టు విశేష అధికారి ఆనంద తీర్థాచార్యులు
● టీటీడీ ఆధ్వర్యంలో గోదావరికి మహా నీరాజనం


సమావేశంలో మాట్లాడుతున్న ఆనందతీర్థాచార్యులు


కార్యక్రమానికి హాజరైన కొవ్వూరు ఆర్డీవో రాణీసుస్మిత, అధికారులు

కొవ్వూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు సనాతన సంప్రదాయాలను నేర్పించాలని తితిదే దాస సాహిత్య ప్రాజెక్టు విశేష అధికారి పగడాల ఆనంద తీర్థాచార్యులు అన్నారు. టీటీడీ ధర్మప్రచారంలో భాగంగా కార్తీకమాసం శుక్రవారం సాయంత్రం కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో గోదావరి మాతకు మహా మంగళహారతిని అందజేశారు. ముందుగా టీటీడీ నుంచి తీసుకువచ్చిన శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు విశిష్టపూజలు నిర్వహించారు. అనంతరం గణపతి, విశ్వక్షేన, కలశ, షోడశ, గోదావరి పూజ నిర్వహించారు. తర్వాత గోదారమ్మకు వాయినం అందజేశారు. అనంతరం ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో గోదారమ్మకు వివిధరకాల హారతులు సమర్పించారు. వేలాదిగా భక్తులు, మహిళలు తరలివచ్చారు. దీంతో గోష్పాదక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా జాయింటు కలెక్టర్ మేఘాస్వరూప్, అడిషనల్ ఎస్పీ ఎస్.మురళీకృష్ణ, ఆర్డీవో రాణి సుస్మిత, మున్సిపల్ చైర్మన్ బావన రత్నకుమారి, మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, మాజీ మున్సిపల్ చైర్మన్లు సూరపనేని చిన్ని, బీజేపీ రాష్ట్ర నాయకుడు పరిమి రాధాకృష్ణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వరరావు, సూర్యదేవర రంజిత్,



తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, పట్టణ సీఐ పి. విశ్వంల్ సీఐ కె.విజయ్‌బాబు, పిల్లల మర్రి మురళీకృష్ణ, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంట రాజు, మున్సిపల్, విద్యుత్‌శాఖ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులకు వెంకటేశ్వరస్వామి వారి ప్రసాదాన్ని పంపిణీ చేసి వేదాశ్వీరచనాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆనంద తీర్థాచార్యులు గోష్పాదక్షేత్రంలో గత 17 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందదాయకమన్నారు. అనంతరం అల్లూరి ఇంద్రకుమార్, జాయింట్ కలెక్టర్ మేఘాస్వరూప్, అడిషనల్ ఎస్పీ ఎస్.మురళీకృష్ణ మాట్లాడారు. గోదావరి హారతి కార్యక్రమం దిగ్విజయం కావడానికి సహకరించిన అధికారులకు, భక్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన గుడ్డు

● రూ.6.10కి చేరిక ● గడిచిన నాలుగేళ్ల కంటే ... రికార్డు స్థాయిలో పెరుగుదల ● పౌల్ట్రీ పరిశ్రమకు ఊరట



మండపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎన్నడూలేని విధంగా నాలుగేళ్ల తర్వాత కోడి గుడ్డు ధర రికార్డు స్థాయికి చేరుకుంది. కోవిడ్ సమయంలో రూ. 6.20 పైసలు పలికినప్పటికీ రెండు మూడురోజుల కంటే ధర నిలవలేదు. ఆ తర్వాత ఇప్పుడు రూ.6.10కి చేరటంతో కోళ్లపరిశ్రమ రైతులకు కాస్త ఊరట కలిగింది. ఉమ్మడి జిల్లాలో 300 వరకు కోళ్ల ఫారాలు ఉన్నాయి. వాటిలో 1.40 కోట్ల మేర కోళ్లను పెంచుతుండగా, వాటి ద్వారా నిత్యం 1.10 కోట్ల మేర గుడ్లు ఉత్పత్తి జరుగుతోంది. వీటిలో 40 శాతం స్థానిక అవసరాలకు వాడుతుండగా, మిలిగిన గుడ్లు 60 శాతం మేర బీహార్, పశ్చిమబెంగాల్, ఒడిశా, తదితర రాష్ట్రాలకు ఎగుమతులు అవుతుంటాయి. కాగా, శీతాకాలం కావటంతో వచ్చే జనవరి వరకు ధర నిలకడగా ఉంటుందని కోళ్ల ఫారాల నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఫ్రెంచి సంస్కృతి అవగాహనకు

చలన చిత్రోత్సవాలు దోహదం

● ఆర్‌ఏ అంకితీకుమార్ ● యానాంలో మూడు రోజులపాటు చలన చిత్రోత్సవాల ప్రదర్శన


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఏ అంకిత్‌కుమార్

యానాం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారత్, ఫ్రెంచి దేశాల స్నేహ సంబంధాలు బలోపేతం కావడానికి చలన చిత్రోత్సవాలు దోహదపడతాయని యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్, అలయెన్స్ ఫ్రాన్సిస్ అధ్యక్షుడు డాక్టర్ సతీష్ నల్లం అన్నారు. ఫ్రెంచ్ సంస్కృతిలోని భావోద్వేగాలు జీవన విధానం, చలనచిత్ర రీతుల్ని తెలియజేయడం కోసం యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాలిటెక్నిక్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో మూడురోజులపాటు ఫ్రెంచ్ చలన చిత్రోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్ర మాలలో పాల్గొనేందుకు ఫ్రాన్స్ అంబసిడర్ (రాయబారి) తెర్రీ మాత్యూ యానాం వచ్చారు. అలయెన్స్ ఫ్రాన్సెస్, పుదుచ్చేరి, యానాం సహకారంతో మూడు రోజుల పాటు జరుగనున్న చలన చిత్రోత్సవాన్ని ఫ్రాన్స్ రాయబారి తెర్రీ మాత్యూ ప్రారంభించారు. కార్యక్రమంలో ఫ్రెంచి కౌన్సిల్ జనరల్ ఎటెన్నీ రోలాండ్ పీగే, అలయన్స్ ఫ్రాన్సెస్ డైరెక్టర్ లారెంట్ జాలికస్,అలయెన్స్ ఫ్రాన్సిస్ అధ్యక్షుడు డాక్టర్ సతీష్ నల్లం పాల్గొన్నారు. ఈసందర్భంగా డాక్టర్ నల్లం మాట్లాడుతు యానాంలో ఫ్రెంచి బాషా, సంస్కృతి పట్ల అసక్తి పెంచడం కోసం ఫ్రెంచి శిక్షణ తరగతుల్ని యానాంలోని రీజెన్సీ పాఠశాల, రాజీవ్‌గాంధీ పాఠశాలలో ప్రారంభించామన్నారు. 20 నిమిషాల నిడివిగల కబ్రి ఇమాంజ్ సలాడ్ చిత్రాన్ని తొలిరోజు ప్రదర్శించారు.

కార్యక్రమంలో ఎస్పీ వరదరాజన్, డాక్టర్ నల్లం వెంకటరామయ్య, సాధనాల బాబు, తదితరులు పాల్గొన్నారు.

అప్పులు తీర్చేందుకు .. అడ్డదారులు

● స్కూటీలపై వెళ్లే మహిళలే లక్ష్యంగా చైన్ స్నాచింగ్‌లు
● ఉమ్మడి జిల్లాలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్టు
● 112 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
● వివరాలు వెల్లడించిన అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా
● కేసును ఛేదించడంలో కృషి చేసిన సిబ్బందికి రివార్డులు


కేసు వివరాలు వెల్లడిస్తున్న కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా

అమలాపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగుల్లో డబ్బులు పోగొట్టుకోవడంతో పాటు స్నేహితుల వద్ద కూడా అప్పులు చేసి, తీరా వాటిని తీర్చలేక దొంగతనాల బాట పట్టాడు ఓ వ్యక్తి. ముఖ్యంగా స్కూటీలపై ప్రయాణించే మహిళలనే లక్ష్యంగా చేసుకుని చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతుండేవాడు. వివరాల్లోకి వెళితే ఐ.పోలవరం మండలం గుత్తెనదీవికి చెందిన సాధనాల వెంకటేష్ (35) ప్రస్తుతం కాకినాడలో ఓ అద్దె ఇంట్లో ఉంటూ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నాడు. దీంతో పోలీసులకు చిక్కడంతో శుక్రవారం ఆయన్ని అరెస్టు చేశారు. ఈ మేరకు అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ మీనా విలేఖరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ పాల్గొన్నారు. దీనికి సంబంధించిన వివరాలివి.. కాకినాడలో తన తల్లిదండ్రులతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్న సాధనాల వెంకటేష్ ఏపీ 05081709 నెంబరు గల గ్లామర్ మోటారు సైకిల్‌పై తిరుగుతూ తరచూ ఆ బండి నెంబరు ప్లేట్లు ఎవరూ గుర్తు పట్టకుండా తారుమారు చేస్తూ ముఖానికి మాస్క్, తలకు టోపీ పెట్టుకుని స్కూటీపై వెళ్లే మహిళలను వెనుక నుంచి వెంబడించి వారి మెడలో చైన్ లాక్కొని అక్కడి నుంచి పరారవుతుండేవాడు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో చేసిన నేరాలకు సంబంధించి అతడి నుంచి 112.784 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్పీ తెలిపారు. వీటిలో ఐదు బంగారు గొలుసులు, 10 గ్రాముల బంగారం ముక్కతో పాటు గ్లామర్ మోటారుసైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇతడిపై ఆరు కేసులు నమోదుచేసి అరెస్టు చేశారు.

నేర వివరాలు ఇలా..

కాకినాడ వలసపాకలలో గల పబ్లిక్ స్కూలు రోడ్డు దగ్గరలో మే 11, 2023న స్కూటీపై వెళుతున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు దోపిడీ. మే 9, 2023లో కాకినాడ ఐడీఎల్ కళాశాల నుంచి సామర్లకోట వెళ్లే రోడ్డులో వంతెన వద్ద స్కూటీపై ఉన్న మహిళ మెడలో నుంచి గొలుసు. ఈ ఏడాది మే 11, 2025 కరప మెయిన్ రోడ్డు వద్ద స్కూటీపై కుమార్తెతో వెళుతున్న మహిళ మెడలో గొలుసు చోరీ. మే 16న ద్రాక్షారామ వద్ద గల వెంకటాయపాలెం దాడిన తరువాత ఆంజనేయస్వామి గుడ్డి వద్ద ఇద్దరు మహిళలు స్కూటీపై కుందూరు వెళుతుండగా స్కూటీ నడుపుతున్న మహిళ మెడలో నుంచి మంగళసూత్రాలతు ఉన్న బంగారుతాడు చోరీ. అలాగే జూన్ 24న వెంటూరు వంతెన వద్ద స్కూటీపై వెళుతున్న మహిళ మెడలో బంగారు గొలుసు, ఆగస్టు 20న ద్రాక్షారామ రిజిస్టర్ ఆఫీసు దాటిన తరువాత స్కూటీపై వెళుతున్న మహిళ మెడలోని గొలుసును చోరీ చేసినట్టు ఎస్పీ విలేఖరులకు వెల్లడించారు. సమావేశంలో రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, సీఐ ఎం.వెంకటనారాయణ, ద్రాక్షారామ ఎస్ఐ లక్ష్మణ్, రామచంద్రపురం ఎస్ఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ కేసుల్లో నిందితుడి కోసం 250 సీసీ కెమెరాలను పరిశీలించడం ద్వారా అతడిని గుర్తించారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన సీఐ, ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బందికి రివార్డులు అందజేసి వారిని అభినందించారు.

ఆపరేషన్ గోదారి

విజ్జేశ్వరం స్కవర్ స్లూయిజ్ నుంచి మురుగునీరు విడుదల


విజ్జేశ్వరం బ్యారేజ్ వద్ద నుంచి స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్ ద్వారా బయటకు వెళుతున్న మురుగునీరు


స్కవర్ స్లూయిజ్ స్విచ్ఛాన్ చేస్తున్న ఈఈ శ్రీనివాసరావు

నిడదవోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గోదావరి నదికి వరదలు వచ్చే వేళ ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటిలో కొట్టుకు వచ్చే మట్టి, చెత్తాచెదారాలు గోదావరి నది బ్యారేజీలో ఒక ప్రత్యేక బ్లాక్‌లోకి వెళ్లే విధంగా ఆనాడు కాటన్ మహాశయుడు గోదావరి నదిపై బ్యారేజ్ నిర్మించాడు.ప్రతి ఏడాది ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు దిగువకు కొట్టుకు వచ్చే మట్టి, చెత్త విజ్జేశ్వరం బ్యారేజీ వద్ద బ్లాక్‌కు చేరుతుంది. దీనిని నీటి పారుదల శాఖాధికార్లు ఏడాదికి ఒకసారి స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్ పేరుతో 4గేట్లను పైకెత్తి దిగువకు విడుదల చేస్తారు. శుక్రవారం నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద హెడ్ వర్క్స్ ఈఈ జి.శ్రీనివాసరావు స్విచ్ఛాన్ చేసి స్కవర్ స్లూయిజ్ ఆపరేషన్ ప్రారంభించారు. ఈ ఆపరేషన్ ద్వారా 4 గేట్లు పైకెత్తి సుమారు 11.401 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. కార్యక్రమంలో కె.ఆనంద్‌బాబు, డి.రాధాకృష్ణ, ఆర్.సునీల్‌బాబు, జి.జయవిక్రమ్, జి.రాజేష్, ఎ.మీరాబాబు పాల్గొన్నారు.

ఓఎన్జీసీతో మత్స్యకారుల ఉపాధికి ఇబ్బంది రాకూడదు

కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఓఎన్జీసీ పైపులైన్ల వల్ల మత్స్యకారుల జీవనోపాధికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. గత ఆగస్టు 22న ఓఎన్జీసీ అగ్ని ప్రమాదంతో మత్స్య సంపదకు, మత్స్యకారుల జీవనోపాధికి జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి ఏర్పాటుచేసిన సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సైంటిస్ట్ డాక్టర్ జోయ్‌తో కలిసి ఆయన కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం సమీక్షించారు. యానాం పరిపాలనా అధికారి అంకిత్,రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారులకు ఏ నష్టం కలగకుండా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే దాట్ల మాట్లాడుతూ సముద్రంలో మత్స్య సంపద గతం కంటే ఇప్పుడు గణనీయంగా తగ్గిందన్నారు. ఇలాంటి అగ్ని ప్రమాదాల వల్ల ప్రజల్లో భయాందోళనలు కలుగుతాయని, వారికి నమ్మకం కల్గించే లా కంపెనీలు వ్యవహరించాలన్నారు. ఎమ్మెల్యే కొండబాబు మాట్లాడుతూ ఓఎన్జీసీ అగ్ని ప్రమా దంతో ఏర్పడిన కాలుష్యం కాకినాడ తీర ప్రాంతానికి చేరుకుని మత్స్యకారుల జీవనోపాధి దెబ్బ తీసిందన్నారు. గతంలో ఓఎన్జీసీ, జీఎస్‌పీసీ పరిహారం కాకినాడ మత్స్యకారులకు ఇవ్వలేదన్నారు. ఈసారి మత్స్యకారులకు కూడా పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సమావేశంలో ఓఎన్జీసీ ఈడీ ప్రబల్ సేన్‌గుప్తా, జిల్లా మత్స్య శాఖ అధికారి కృష్ణారావు పాల్గొన్నారు.

రెవెన్యూ జట్టుకు అభినందనలు

అనంతపురంలో ఈ నెల 7,8,9 తేదీల్లో జరిగిన 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడల్లో కాకినాడ జట్టు 30 పాయింట్లతో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం సాధించింది. ఈ నేపథ్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో శుక్రవారం కాకినాడ రెవెన్యూ క్రీడాకారుల జట్టును కలెక్టర్ షాన్‌మోహన్ అభినందించారు. మార్చ్‌ఫాస్ట్ విభాగంలో కాకినాడ జిల్లా జట్టు ప్రథమ, పురుషుల విభాగంలో టగ్ ఆఫ్ వార్‌లో ప్రథమ, 100 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ, చదరంగంలో ద్వితీయ, త్రోబాల్‌లో ద్వితీయ స్థానాల్లో నిలిచింది. ఈ సందర్భంగా క్రీడలకు సహకారం అందించిన కలెక్టర్‌కు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు మల్లిబాబు, శ్రీరమణి, ఏపీఆర్ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు, అసోసియేట్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, వీరబాబు, తహశీల్దారు గోపాలకృష్ణ ధన్యవాదాలు తెలిపారు.

యానాంలో ఫ్రాన్స్ అంబాసిడర్ పర్యటన


ఫ్రాన్స్ అంబాసిడర్ మాత్యూ చర్చిస్తున్న ఆర్‌ఏ అంకిత్‌కుమార్

యానాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): యానాం నియోజకవర్గంలో ఫ్రాన్స్ అంబాసిడర్ థియరీ మాథౌ పర్యటించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ఆయన యానాం వచ్చారు. పుదుచ్చేరి నుంచి యానాం వచ్చిన ఆయనకు ప్రభుత్వ అతిథి గృహం వద్ద యానాం పరిపాలనాధికారి అంకిత్‌కు మార్, ఎస్పీ వరదరాజన్ తదితరులు ఘనంగా స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం యానాంలోని పలు పర్యాటక ప్రాంతాలను పరిశీలించారు. ఫ్రెంచ్ సంస్కృతిలోని భావోద్వేగాలు, జీవన విధానం, చలనచిత్ర రీతుల్ని తెలియజేయడం కోసం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల కాన్ఫరెన్స్ హాల్లో మూడు రోజులపాటు ఫ్రెంచ్ చలన చిత్రోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో మాత్యూ యానాం పర్యటనకు వచ్చారు.

నరసన్న ఆలయంలో రూ.లక్ష టిక్కెట్ కౌంటర్


కౌంటర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న దాతలు, అధికారులు, అర్చకులు

అంతర్వేది, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పాలకొల్లుకు చెందిన వాకాడ అప్పారావు-విశాలాక్షి దంపతులు దేవస్థానం వినియోగార్థం సుమారు రూ. లక్ష విలువైన టిక్కెట్ కౌంటర్‌ను ఏర్పాటుచేశారు. ముందుగా అర్చకులు టిక్కెట్ కౌంటర్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించగా దాతలు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం దాతలకు వేదాశీర్వచనం చేసి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించినట్టు ఆలయ సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు.

వలలో పడి మత్స్యకారుడి మృతి


మృతుడు కృష్ణ

కొత్తపల్లి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సముద్రంపైకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు దురదృష్టవశాత్తూ వల వేసేటప్పుడు కాలు జారీ వలలో చిక్కుకొని మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో జరిగిది. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీజాన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పాడ శివారు జగరాజుపేటకు చెందిన కారే కృష్ణ(48) అదే గ్రామానికి చెందిన పిరమాళ్ల దుర్గా ప్రసాద్‌కు చెందిన జాయింట్ బోట్లపై శుక్రవారం ఉదయం మరో 20 మందితో కలిసి ఉప్పాడ మినీ హార్బర్ నుంచి వేటకు వెళ్లారు. చేపలను వేటాడేందుకు వలను సముద్రంలోకి విసిరేటపుడు బోటు నుంచి కాలుజారి వలకు చిక్కుకొని సముద్రంలో గల్లంతయ్యాడు. బోటులో వేటకు వెళ్లిన మత్స్యకారులు సహచర మత్స్యకారులతో సముద్రంలో గాలింపు చేపట్టారు. కృష్ణ మృతదేహం కాకినాడ సమీపంలో హార్బర్‌లో లభ్యమైందని సర్పంచ్ మేరీ జాన్ తెలి పారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేతను గాయపర్చిన వ్యక్తికి రిమాండ్

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురానికి చెందిన టీడీపీ నేత దేవస్థానం చైర్మన్ వేగశ్న ప్రసాద్‌రాజును కొట్టి గాయపర్చిన వేగశ్న గోపిరాజుపై పోలీసులు కేసు నమోదు చేశారు. గత సెప్టెంబరు నెలలో డబ్బులు విషయంలో ప్రసాద్‌రాజు, గోపిరాజు మధ్య వాగ్వాదం జరిగి కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో ప్రసాద్‌రాజును గోపిరాజు కొట్టి గాయపర్చాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శుక్రవారం గోపిరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించినట్టు పోలీసులు తెలిపారు.

పాము కాటుతో మహిళ మృతి

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పాము కాటుతో ఓ మహిళ మృతిచెందింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వెలిచేరు గ్రామానికి చెందిన పల్లికొండ కుమారి(40) గు రువారం రాత్రి పక్కంటి వారికి పాలు ఇవ్వ డానికి వెళ్తుండగా పాము కాటు వేసినట్టు అనిపించడంతో భర్త అన్నవరానికి తెలియజేసింది. వెంటనే రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

తల్లికి బాలిక అప్పగింత

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలీ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఈనెల 13న ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లి పోలీసులను ఆశ్రయించింది. సీఐ విద్యాసాగర్ తన సిబ్బందితో బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు.బాలిక తిరుపతిలో ఉన్నట్టు గుర్తించి సురక్షితంగా ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భార్యపై అనుమానంతో ఇంటికి నిప్పు

» మంటలను అదుపు చేసిన స్థానికులు » భర్త అరెస్టు » ఈదరపల్లిలో ఘటన


వంటింట్లో దహనమైన సామగ్రి

అమలాపురం రూరల్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భార్యపై అనుమానం పెంచుకున్న భర్త గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆమె ఉంటున్న ఇంటికి నిప్పు పెట్టి చంపాలని ప్రయత్నించాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి పోలేరమ్మ గుడి సెంటర్‌కు చెందిన విజయ దుర్గాభవానీకి అమలాపురానికి చెందిన జంగా శివ అలియాస్ సురేష్‌తో వివాహం జరిగింది. వీరికి ముగ్గురు సంతానం. దుర్గాభవానీ తల్లికి ఆరోగ్యం బాగోకపోవడంతో పిల్లలతో కలిసి కొన్ని రోజుల క్రితం పుట్టింటికి ఈదరపల్లి వచ్చింది. అప్పటికే భార్యపై అనుమానం పెంచుకున్న శివ రాత్రి 1 గంట సమయంలో పెట్రోల్ సీసాలతో ఆ ఇంటికి చేరుకున్నారు. కిటికీల నుంచి లోనికి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దాంతో ఒక్కసారిగా మంటలు రేగడంతో ఉలిక్కిపడ్డ భవానీ కుటుంబ సభ్యులు పెద్దపెద్ద కేకలు వేసి బయటకు పరుగులు తీశారు. అప్పటికే చుట్టుపక్కల వారు రావడం, స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. శివ వంట గదిలోకి పెట్రోల్ సీసా విసరడంతో మంటలు గ్యాస్ సిలిండర్ వద్దకు చేరుకుంటున్న సమయంలో అదుపు చేయడం వల్ల పెను ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పారిపోయేందుకు ప్రయత్నిస్తున్న శివను అదుపులోకి తీసుకున్నారు. భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



యానాంలో చిన్నారుల నృత్యప్రదర్శన

నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

● జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ రహ్మతుల్లా ● ఘనంగా బాలల దినోత్సవం

ముమ్మిడివరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలలకు రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కుల పరిరక్షణకు ప్రతీఒక్కరూ కృషిచేయాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మహ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ముమ్మిడివరం మండలం అనాతవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో చిల్డ్రన్స్‌డే సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 14 ఏళ్లలోపు పిల్లలు నిర్బంధ విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలలోనే ఉన్నారు. 14ఏళ్లలోపు చిన్నారులు షాపుల్లోగానీ, ఫ్యాక్టరీల్లో గానీ పనిచేస్తే చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●ముమ్మిడివరం మండలం కొమానపల్లిలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు విత్తనాల శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్.రాంబాబు, కేవీస్వీ త్రిమూర్తులు, ఎస్ఎస్ మునేశ్వరరావు, కె.సూర్యనారాయణమ్మ, సాధనాల శ్రీనివాసరావు, పి.వికాశిని, ఏఎస్‌డీఎస్‌వీవీఎస్ ప్రసాద్, ఎస్.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, కె.రామలక్ష్మి, పీటీవీవీ వర్మ పాల్గొన్నారు. ముమ్మిడివరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నెహ్రూ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీర ప్రసాద్, దొనిపాటి ఆంజనేయులు, తటవర్తి నాగరాజారావు, జీవీ రామారావు, కాశి సిద్ధార్థకుమార్, కాశి బాబుజగ్జీవన్‌రామ్, ఎంటీ ప్రసాద్, కాశి సింహాద్రివర్మ, గోనమండ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం,(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లోని పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించారు. అమలాపురం వైద్య కళాశాలలో ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ ప్రవీణ్ మస్కే ఆధ్వర్యంలో బాలల దినోత్సవం, ప్రపంచ మధుమేహ నివారణా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కేక్ కట్ చేశారు. డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య, సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ హరికిరణ్‌వర్మ, అడిషనల్ సూపరింటెండెంట్లు డాక్టర్ సలాం, డాక్టర్ వరదా, డాక్టర్ శరణ్య తదితరులు పాల్గొన్నారు. తులిప్స్ పబ్లిక్ స్కూలులో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. వివిధ పోటీల్లో విజేతలకు డైరెక్టర్ నెల్లి రమేష్, ప్రిన్సిపాల్ నెల్లి సబిత సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు దుర్గాప్రసాద్, శరణ్య తదితరులు పాల్గొన్నారు. కామనగరువు ఆదిత్య పబ్లిక్ స్కూలులో నిర్వహించిన బాలల దినోత్సవానికి తెలుగు అధ్యాపకుడు డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రామ్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ పాల్గొన్నారు. ఎస్‌బీఐ ప్రతినిధి బులుసు శాస్త్రి చేతులమీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. సాకుర్రు గరువు మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో కమిటటీ చైర్మన్ శిరగం ఫణీంద్రరావు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం అప్పారి ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గుత్తుల చిరంజీవిరావు ఆధ్వర్యంలో వివిధ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలెపు కిశోర్‌కుమార్, కె.దుర్గారావు, ఆచంట శ్రీను, మానేపల్లి రాజేష్, బొంతు దేవి, ఎ.బసవేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాలను మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోను శుక్రవారం ఘనంగా జరిపారు. విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాలలో వివిధ వేషధారణల్లో చిన్నారులు ప్రదర్శనలు నిర్వహించారు. మోరిలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో సీహెచ్ ఇందిర, సూపర్‌వైజర్ చంద్రకళ, ఎ.పద్మావతి, కె.జ్యోతి, కె.శేషవేణీ, వరలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి): భీమనపల్లి గ్రంథాలయంలో శుక్రవారం భారత మాజీ ప్రధాని దివంగత జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని నిర్వహించారు. ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, సొసైటీ చైర్మన్ ఆకేటి శ్రీనివాస్(పెద్ద) నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థినీవిద్యార్థులకు మిఠాయిలు పంచారు. జ్యోతి ప్రజ్వలన చేసి 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. గ్రంథాలయాధికారి నిమ్మకాయల శేషకుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆకుల వెంకటరెడ్డినాయుడు, గొలకోటి తాతాజీ, మంచెం బాబి, యాళ్ళ సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు. ఉప్పలగుప్తంలో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్ కడిమి చిన్నవరాజు, చిక్కం పెద్దబ్బులు, చిక్కం సూర్యమోహన్, గ్రంథాలయాధికారి సలాది నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పలు ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. అంబాజీపేట విద్యామందిర్ ఇంగ్లీస్ మీడియం పాఠశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నిర్వహకులు సాయిప్రసాద్, రాధామణి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవ వేడుకలను పాశర్లపూడి హైస్కూలు, మామిడికుదురు దీప్తి స్కూలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పాశర్లపూడి హైస్కూలులో వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. విజేతలకు ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తల్లి గంగామణి జ్ఞాకార్థం బహుమతులను అందించారు.

రాజోలు(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారని రాజోలు ఎంఈవో ఎన్.మనోహరం తెలిపారు. ఆయన మాట్లాడుతూ భారత మాజీ ప్రధాని నెహ్రూ జయంతి రోజున మనం బాలల దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నామన్నారు. బి.సావరం సిద్ధార్థనగర్‌లో జొన్నలగడ్డ జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బత్తుల మురళీకృష్ణ, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ చిన్నారులకు పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు కె.ఏసుబాబు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రమశిక్షణ అవసరం

యానాం(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి చదువుతో పాటు క్రమశిక్షణ అవసరమని యానాం పరిపాలనాధికారి అంకిత్‌కుమార్‌అన్నారు. యానాం విద్యాశాఖ, సాంఘిక సంక్షేమశాఖ సంయుక్త నిర్వహణలో స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో ఈవేడుకను నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ అధికారి సూరంపూడి రాజేంద్ర, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణప్రవీణ్ అధ్యక్షతన జరిగిన కార్యాక్రమంలో ముఖ్యఅతిథిగా పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ హాజరయ్యారు. ముందుగా జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక, ఆటల పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు, చిన్నారులకు అతిధులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్వశిక్ష అభియాన్ ఏడీపీసీ కమిడి ప్రభాకరరావు, జూనియర్‌కళాశాల ప్రిన్సిపాల్ జి.రత్నప్రభ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. యానాం ఓల్డ్‌ఏజ్‌హోమ్ బేబీ సెంటర్‌లో శుక్రవారం చిల్డ్రన్స్ డే వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యానాంలో ఓల్డ్‌ఏజ్‌హోమ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లాడి కృష్ణారావు ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్‌కట్ చేసి పిల్లలందరికీ కేక్, చాక్లెట్, బిస్కెట్లను ఇచ్చారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

డ్రోన్‌లను అందుబాటులోకి తీసుకువస్తాం

● పశుదాణా పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే గిడ్డి



పశుదాణాను రైతుకు అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న 26 సొసైటీల పరిధిలోకి రైతుల ఉపయోగార్థం డ్రోన్‌లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం సొసైటీలో పశుదాణా పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి అనంతరం మాట్లాడారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన పశుదాణాను పాడిరైతులకు అందించి పాడిపరిశ్రమ అభివృద్ధికి జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమమార్ చేస్తున్న కృషి అభినంధనీయమని ఈసందర్భంగా కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. దాణా బ్యాగ్ రూ.1020 మాత్రమేనని పాడిరైతులు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. అనంతరం సహకార వారోత్సవాలు సందర్భంగా జెండాను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేయించారు. అలాగే వారోత్సవాల పోస్టర్‌ను జిల్లావిద్యాసహకార అధికారి ఆదిమూలం వెంకటేశ్వరావుతో కలిసి ఆయన విడుదల చేశారు. పి.గన్నవరం సబ్‌డివిజన్ ఇంచార్జ్ పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ విజయరెడ్డి, డాక్టర్ జి.శ్రీనివాస్, డాక్టర్ కృష్ణ చైతన్య, సొసైటీ చైర్మన్ సాధనాల శ్రీవెంక ట సత్యనారాయణ, సర్పంచ్ బొండాడ నాగమణి, సొసైటీ సీఈవో కె.సోమేశ్వరరావు, చైర్మన్లు తోలేటి వెంకటనారాయణమూర్తి, బొరుసు సత్యనారాయణ, వాసంశెట్టికుమార్, పప్పుల సాయిబాబు, పెద్దిరాజు, శేరు శ్రీనుబాబు, గనిశెట్టి శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్, రవికుమార్, ప్రసన్నకుమార్, రైతులు పాల్గొన్నారు.

మలికిపురం(ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పైలెట్ ప్రాజెక్టుగా పశువుల దాణా మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకు వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నారని రామరాజులంక సొసైటీ అధ్యక్షుడు ఉంగరాల బాలాజీ అన్నారు. 50 కిలోల బస్తా రూ.1020కు అందజేస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎంవీ సత్యవాణి, డాక్టర్ డి.శివకుమార్, సొసైటీ డైరెక్టర్లు నున్నబోయిన ఏసు, మేడిచర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు. గుడిమెళ్లంక సొసైటీ వద్ద సహకార సంఘ అధ్యక్షుడు గమిడి శ్రీనివాస్ రైతులకు దాణా పంపిణీ చేశారు. గుడిమెళ్లంకలో సొసైటీ అధ్యక్షుడు గమిడి శ్రీనివాస్ పశుదాణా సరఫరా చేశారు.

'అర్జీలలో వచ్చే ప్రతి సమస్యను పరిష్కరిస్తాం'

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి): ప్రజలు అర్జీలు రూపంలో అందించే ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తామని నియోజకవర్గ టీడీపీ కో-కన్వీనర్లు మోకా ఆనందసాగర్, దాసరి వీర వెంకటసత్యనారాయణలు తెలిపారు. పి.గన్నవరం టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో అర్జీల స్వీకరణ కార్యక్ర మంలో పాల్గొని మాట్లాడారు. నియోజవర్గంలో ని వివిధ మండలాల నుంచి కార్యకర్తలు, ప్రజల నుంచి వివిధ సమస్యలతో కూడిన 30 అర్జీలు స్వీకరిస్తామన్నారు.

● మండలంలోని గాజులగుంట గ్రామానికి చెందిన మట్టపర్తి దుర్గ మూడేళ్ల కుమారుడు లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈక్రమంలో రాజమహేంద్రవరం ఆసుపత్రిలో ఆపరేషన్ నిమిత్తం రూ.95వేలు అవసరంకాగా తమవంతు సాయంగా నియోజవకర్గ కన్వీనర్లు మోకాఆనందసాగర్ రూ.10వేలు, దాసరి వీరవెంకట సత్యనారాయణ రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఆయా కార్యక్రమాలలో నాయకులు చిట్టూరి శ్రీనివాస్, పత్తిపాటి ఉమామహేశ్వరి, అంబటి భూలక్ష్మి, మోల్లేటి శ్రీనివాస్, బోణం బాబు, శేరు శ్రీనుబాబు, మట్టపర్తి వెంకటేశ్వరావు, తదితరులు పాల్గొన్నారు.

యానాం మున్సిపల్ కమిషనర్‌గా అద్దంకి

యానాం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): యానాం మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వ ఆసుపత్రి సుపరింటెండెంట్ అద్దంకి మల్లికార్జునరావు (మోహన్) శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మోహన్‌కు యానాం మున్సిపల్ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా మాజీ మున్సిల్ వైస్‌చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, మున్సిపల్ సిబ్బంది, ఆర్‌ఏ కార్యాలయ సిబ్బంది కలిసి శాలువాతో సత్కరించారు.

గ్రంథాలయాలే విజ్ఞాన భాండాగారాలు

● ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



అల్లవరం వద్ద మాట్లాడుతున్న తహశీల్దార్ నరసింహం

అల్లవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలే విజ్ఞాన భాండాగారాలని ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు అన్నారు. ప్రతీ విద్యార్థి సెల్‌ఫోన్ వాడకుండా గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవాలని తహశీల్దార్ వీవీఎల్ నరసింహం అన్నారు. అల్లవరం శాఖ గ్రంథాలయం వద్ద గ్రంథాలయాధికారిణి వి.ద్వారకామణి ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవ సభ జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలనచేసి నెహ్రూ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలోని గ్రంథాలయశాఖలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. కమిటీ అధ్యక్షుడు విళ్ల వీరాస్వామినాయుడు, జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో జాగు రాంబాబు, శీలం వెంకటరమణ, పి.నాగేశ్వరరావు, నిమ్మకాయల విస్సు, పోలిశెట్టి కృష్ణ, అరిగెల స్వామి, లైబ్రేరియన్ నాగరాజు పాల్గొన్నారు.

మలికిపురం(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు మలికిపురం శాఖ గ్రంథాలయంలోను, కేశనపల్లి గ్రంథాలయంలోను నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు గెడ్డం రాజ్యలక్ష్మి, యెనుముల నాగు, యర్రంశెట్టి గోపాలకృష్ణ, గ్రంథాలయ అధికారులు వి.నాగేంద్ర కుమార్, ఇందిర పాల్గొన్నారు.

పి.గన్నవరం(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ అధికారి జి.రవికుమార్ ఆధ్వర్యంలో నెహ్రూ జయంతి ని ఘనంగా నిర్వహించారు. మండలపరిషత్ పరిపాలనాధికారి వియస్‌వి శర్మ, నేలపూడి రామకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు సాకా సత్యం, గెడ్డం ఆనందరావు, కుసుమ ప్రభుదాస్, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ వెంకటేష్, స్థానిక లిటిల్ ఎంజల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్వేది(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలోలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో మొదటిరోజు నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. వారంరోజులు పోటీలు నిర్వహించి ముంగిపు రోజున బహుమతులు అందజేస్తారని గ్రంథాలయాధికారి వై.వెంకటలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కనకలింగేశ్వరరావు, చింతా శ్యామ్, వి.సత్యనారాయణ, బీర అశోక్, మాజీ సర్పంచ్ నల్లి సురేంద్ర, పి.నాగశ్రీవిద్య, గుబ్బల శ్రీనివాస్, సీహెచ్ భారతీదేవి పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలి

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవడం ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట శాఖా గ్రంథాలయంలో రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని వాటిని వినియోగించుకోవాలని మండల విద్యాశాఖాధికారి ఎం.వెంకన్నబాబు సూచించారు. మామిడికుదురు శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాలు శుక్రవారం ఎంఈవో ప్రారంభించారు. వారోత్సవాల్లో భాగంగా మొదటిరోజు శుక్రవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు.

బీహార్‌లో ఎన్‌డీఏ విజయంపై సంబరాలు

అమలాపురం టౌన్, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించడంతో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో ముఖ్యఅతిథులుగా హాజరైన జాతీయ కౌన్సిల్ సభ్యుడు మానేపల్లి అయ్యాజీవేమా, రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్‌లు కేక్‌ను కట్ చేశారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో పట్టణశాఖ అధ్యక్షుడు అయ్యల బాషా, మండలశాఖ అధ్యక్షుడు బొంతు శివాజీ, యనమదల వెంకటరమణ, కురుమెల్లి శ్రీనివాసరావు, రమావర్మ, మోకా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధికి ప్రాధాన్యం'



పొదలాడలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవ

రాజోలు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి రాజోలు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర సీఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. పాలగుమ్మిలో ఎంజీఆర్ఎన్ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.32లక్షలతో నూతనంగా నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పొదలాడలో సెంటర్ నుంచి శిరిగినీడి జగ్గారావు ఇంటి వరకు ఎంజీఎన్ఆర్‌ఈజీఏస్ నిధులు రూ.54లక్షలతో నూతనంగా నిర్మించిన ఒక కిలోమీటరు సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఇప్పటి వరకు 40 కిలోమీటర్లు ఎంజీఎన్ఆర్‌ఈజీఎస్ నిధులతో 439 గ్రామీణ రోడ్లు రూ.27 కోట్లతో సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. మరో 500 రోడ్లును రూ.30 కోట్లతో నిర్మిస్తున్నామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖకు చెందిన మూడు ప్రాజెక్టు రోడ్లు రూ.4కోట్ల 50 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. రూ.44 కోట్లతో 58 గ్రామీణ ప్రాజెక్టు రోడ్లను గుర్తించి మంజూరు కోసం ప్రతిపాదనలు పంపామని తెలిపారు. రూ.27 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లు మరమ్మతులు, రూ.11 కోట్లతో మంజూరు 10 ఆర్‌అండ్‌బీ రోడ్లు సుమారు 20 కిలోమీటర్ల పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో రాజోలు నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు చిటికెల రామ్మోహనరావు, రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, రాష్ట్ర డైరెక్టర్లు గుబ్బల ఫణికుమార్, బందెల పద్మ, రాష్ట్ర పార్టీ మహిళా ప్రధాన కార్యదర్శి మంగెన భూదేవి, రాజోలు ఎంపీపీ కడలి శ్రీదుర్గ, జడ్పీటీసీ మట్టా శైలజ, చాగంటి స్వామి, పినిశెట్టి బుజ్జి, సూరిశెట్టి శ్రీనివాస్, సర్పంచ్‌లు కడలి సత్యనారాయణ, అప్పారి లక్ష్మి, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కాండ్రేగుల సత్యనారాయణ, స్వామికృష్ణ, సొసైటీ అధ్యక్షుడు కాండ్రేగుల కుశులుడు, గుండాబత్తుల తాతాజీ, పీఆర్ డీఈఈ పీవీ కృష్ణంరాజు, జేఈ ఎంవీఎస్వీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ డైరెక్టర్ ఆకెళ్లకు సత్కారం



నారాయణమూర్తిని సన్మానిస్తున్న బ్రాహ్మణ నాయకులు

అమలాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ద్వారా అనేక పథకాలను బ్రాహ్మణ సామాజిక వర్గం సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ఆకెళ్ల నారాయణ మూర్తి అన్నారు. శుక్రవారం అమలాపురం పట్టణంలోని బ్రాహ్మణ క్రెడిట్ సొసైటీ ప్రాంగణంలో మేనేజర్ సూర్యభాస్కరం ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన వారికి క్రెడిట్ సొసైటీ ద్వారా రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ మేనేజర్ ఆకెళ్ల సూర్యభాస్కర్, దువ్వూరి సురేష్, మాచిరాజు రవికుమార్, కొత్తూరి శ్రీను, దుర్గబాబి, గొర్తి పవన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

శ్మశానవాటిక రహదారి అధ్వానం

● అంతిమ యాత్రలో అవస్థలు



దేవగుప్తం నుంచి బురదలో శ్మశానవాటికకు మృతదేహం తరలిస్తున్న దృశ్యం

అల్లవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మోకాలి లోతు బురదలో మృతదేహాన్ని శ్మశానవాటికకు తరలించడంలో నరకయాతన పడుతున్నారు. అంతిమ సంస్కారాలకు వెళ్లే రహదారి సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దేవగుప్తం పంచాయతీ పరిధి నుంచి శ్మశానవాటికకు మృతదేహాన్ని తరలించాలంటే కష్టాలు అన్నీఇన్నీ కావు. దేవగుప్తం, డి.రావులపాలెం గ్రామాల నుంచి లోయర్ కౌశికగట్టున అంతిమ సంస్కారాలు చేస్తారు. శ్మశానానికి సరైన మార్గం లేక మోకాలి లోతు బురదలో మృతదేహాలను తరలిస్తున్నారు. దేవగుప్తానికి చెందిన ఒక మహిళ మంగళవారం అనారోగ్యంతో మృతిచెందగా లోయర్ కౌశికగట్టుకు మృతదేహాన్ని బురదలోనే అతికష్టంతో తీసుకువెళ్లారు. శ్మశానవాటికకు వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని దేవగుప్తం, డి.రావులపాలెం గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రైతులు సహకరించండి

మలికిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నర్సాపురం-దిండి జాతీయ రహదారిలో భూములు ఉన్న రైతులు తమకు చెందిన భూ పత్రాలను వెంటనే రెవెన్యూ కార్యాలయంలో అందజేయాలని అమలాపురం ఆర్డీవో కె.మాధవి ఆదేశించారు. గుడిమెళ్లంక పంచాయతీ వద్ద జరిగిన గ్రామసభలో ఆర్డీవో మాధవి మాట్లాడుతూ ఈ ఎలైన్‌మెంట్‌లో భూములు పడ్డ రైతులు తమకు చెందిన ఒరిజినల్ పత్రాలను అందజేస్తే పరిహారం బ్యాంకుల్లో వేస్తామన్నారు. తద్వారా రోడ్డు నిర్మాణానికి సహకరించిన వారవుతారన్నారు. మేడిచర్లపాలెం, దిండి, గుడిమెళ్లంకకు చెందిన రైతులు అడిగిన పలు సందేహాలకు సమాధానాలిచ్చారు. సమావేశంలో తహశీల్దార్ టి.శ్రీనివాసరావు, సంబంధిత రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించండి

మలికిపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ బీజేపీ నాయకులు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో విశ్వేశ్వరాయపురంలో ఆయన క్యాంపు కార్యాలయంవద్ద పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి చర్చించారు. తదుపరి పలు సమస్యలపై వినతి పత్రం అందించారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వే లైన్ పనులను వేగవంతం చేసేవిధంగా కేంద్రం నిధులు విడుదల చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన 25శాతం నిధులను విడుదల చేసేవిధంగా అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరారు. రైల్వేలైను కోసం వివిధ స్థల వివాదాలను తొలగించి న్యాయపరంగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దిండి-చించినాడ వంతెన మరమ్మతులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్, అడబాల రాంబాబు, మేడిచర్ల చాణుక్య, కాపిశెట్టి కనకేశ్వరరావు, పోతురాజు సురేష్ పాల్గొన్నారు.

ఎస్పీకి బాలిక కుటుంబం కృతజ్ఞతలు

అమలాపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల అమలాపురం పట్టణానికి చెందిన పదేళ్ల బాలిక నిషిత కిడ్నాప్‌కు గురై సురక్షితంగా తల్లిదండ్రుల వద్దకే చేరుకున్న ఆ బాలికతో సహా తల్లిదండ్రులు కముజు రమణ దంపతులు శుక్రవారం జిల్లా ఎస్పీ రాహుల్ మీనాను కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అపహరణకు గురైన బాలికను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసుల కృషిని వారు ప్రశంసించారు. ఎస్పీ రాహుల్ మీనాకు దుశ్శాలువా కప్పి పూలమాలతో సత్కరించి కముజు రమణ దంపతులతోపాటు వైసీపీ నాయకులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, వైసీపీ నాయకులు గొవ్వాల రాజేష్‌తో పాటు పలువురు ఉన్నారు.

మధుమేహంపై జాగ్రత్తలు తీసుకోండి

ముమ్మిడివరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజలందరికీ డయాబెటిస్‌కు నివారణ, నిర్వహణలో వైద్య సిబ్బంది నూతన మార్గాలను తెలియజేసి షుగర్ వ్యాధి నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర పిలుపునిచ్చారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యులతో ప్రపంచ డయాబెటిస్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

రైతులకు సహకార సంఘాలు కొండంత అండ

ఉప్పలగుప్తం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): భూమి సాగులో ఆర్థిక చేయూతనిచ్చి సహకార సంఘాలు రైతులకు కొండంత అండగా నిలిచాయని ఆక్వా స్టేట్ డైరెక్టర్ దేశంశెట్టి వెంకట లక్ష్మీనారాయణ అన్నారు. 72వ అఖిలభారత సహకార వారోత్సవాలను శుక్రవారం భీమనపల్లిలో ఆయన ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ ఆకేటి శ్రీనివాస్(పెద్ద) సప్తవర్ణ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఈవో పోలిశెట్టి వరప్రసాద్, బేసే గోపీకృష్ణ, మంచెం బాబి, సుధారామకోటి, ఆకుల వెంకటరెడ్డినాయుడు, చీకట్ల సత్తిబాబు, గొలకోటి తాతాజీ, యాళ్ళ సత్తిబాబు, జంపన సుమన్‌వర్మ, ఆకేటి బాబులు, చీకట్ల నాని పాల్గొన్నారు.

సహకార వారోత్సవాలు

కాట్రేనికోన, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): అఖిల భారత సహకార వారోత్సవాల్లో భాగంగా కందికుప్ప సొసైటీ వద్ద శుక్రవారం చైర్మన్ నూకల వీవీఎస్ఎన్వీ ప్రసాద్(మూర్తి) సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. కాట్రేనికోన సహకార సంఘం వద్ద చైర్మన్ పెసింగి రంగారావువర్మ సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కాలాడి వీరబాబు, బొంతు శివకుమార్, నూకల కొండలరావు, పాలెపు ధర్మారావు, ఉదయ్, సీఈవోలు యర్రంశెట్టి రామచంద్రరావు, విత్తనాల ఎస్ఎస్ఎన్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలు తనిఖీ చేసిన డీఈవో

అంతర్వేది, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో సఖినేటిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను డీఈవో షేక్ సలీంబాషా శుక్రవారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి సూచనలు చేశారు. విద్యార్థుల నుంచి ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. గతంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. అనంతరం పాఠశాల స్టాఫ్‌కు సమావేశం ఏర్పాటుచేసి సూచనలిచ్చారు. అనంతరం ప్రైవేటు పాఠశాలలకు సమావేశం ఏర్పాటుచేసి ఫీజులు, స్కూలు వెహికల్స్‌పై హెచ్చరికలు జారీ చేశారు. ప్రస్తుతం బాలికలపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు అవగాహన సదస్సులను ఏర్పాటు చేయాలన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సమావేశం ఏర్పాటుచేసి, పాఠశాలలో ఆయా మధ్యాహ్న భోజన నిర్వాహకులతో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల సంఖ్యను పెంచాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి డి.కిశోర్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు కోలా వీరాస్వామి, శ్రీధర్‌కృష్ణ, ప్రైవేటు పాఠశాలల ప్రెసిడెంట్ దివ్వి రాఘవేంద్రనాయుడు, రజియాభాను, విశ్వనాథం పాల్గొన్నారు.

'కార్తీక వనసమారాధనలు ఐక్యతకు దోహదం

పి.గన్నవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు సంఘాల ఐక్యతను పెంచుతాయని ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని నాగుల్లంకలో శ్రీవిఘ్నేశ్వర శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీకవనసమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబులు మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి పాటుపడుతూ నిరుపేద కుటుంబాలకు సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటకరంగ అకాడమీ డైరెక్టర్ చెల్లిబోయిన గంగాదేవి, సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి, టీడీపీ కో-కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, సంఘ అధ్యక్షుడు కంకటాల ఈశ్వరావు, ఉపాధ్యక్షులు చెల్లిబోయిన శ్రీనివాసరావు, సంసాని పెద్దిరాజు, పితానినాని, మోల్లెటి గోపాలకృష్ణ, గుడాల సంపదరావు పాల్గొన్నారు.

విద్యతో సమాజంలో గుర్తింపు

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు విద్య ఎంతో ఉపయోగపడుతుందని మంచి ఉద్యోగం సాధించిన అనంతరం సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని పి.గన్నవరం, కొత్తపేట ఎమ్మెల్యేలు గిడ్డి సత్యనారాయణ, బండారు సత్యానందరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంవద్ద శుక్రవారం నిర్వహించిన కాపు యువజన సంఘం ఆధ్వర్యంలో కాపు కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్వకొలను తాతాజీ, ఆకుల రామకృష్ణ, నల్లా పవన్, నామన రాంబాబు, నల్లా అజయ్, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, రవణం రాము, కొర్లపాటి కోటబాబు, సుంకర బాలాజీ, మేడిద శ్రీనివాసరావు, అంబటి భూలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● అంబాజీపేట వెంకట్రాజు ఆయిల్ మిల్లు వద్ద ఆయిల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో కార్తీక వనసమారాధన కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఉత్సాహంగా.. ఉల్లాసంగా పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



ఆలమూరు శ్రీసిద్ధార్థ స్కూల్‌లో నెహ్రూ వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

బాలలు..భావి పౌరులు

ఆలమూరు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలమూరు శ్రీసిద్ధార్థ స్కూల్‌లో జరిగిన బాలల దినోత్సవంలో జవహర్‌లాల్ నెహ్రూ వేషధారణ లో చిన్నారులు అలరించారు. స్కూల్ డైరెక్టర్ కె.ముల్లారావు నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం బాలల దినోత్సవాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జరిగిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు వాటర్ బాటిల్స్ పంపిణీ: ఆలమూరు మండల పరిషత్ స్కూల్‌లో విద్యార్థులకు స్టీల్‌వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.రాజు, ఎంఈవోలు బి.అప్పాజీ, ఎన్.రాజు, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు అద్దరి శ్రీనివాసరావు అధ్వర్యంలో చిన్నారుల సమక్షంలో కేక్ కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఆలమూరుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎలుగుబంటి శ్రీనివాస్ అధ్వర్యంలో చిన్నారులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిల్లి రాంబాబు, సీఆర్ఎంటీ జ్యోతి, వై.బూరయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.

మండపేటలో...

మండపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని మండపేటతోపాటు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా జరిపారు. దివంగత జవహర్‌లాల్ నెహ్రూ బాలల కోసం చేసిన సేవలను వక్తలు గుర్తు చేశారు. మండపేటలో వున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతోపాటు మండపేట రూరల్‌లో వున్న పాఠశాలల్లో కూడా బాలల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించడంతో పాటు విజేతలకు బహుమతులు అందజేశారు. దివంగత నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు.

విద్యా బ్యాంక్ ప్రారంభం

ఆత్రేయపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ర్యాలి ఎంపీపీ ఫౌండేషన్ పాఠశాలలో శుక్రవారం చిన్నారులు విద్యాసామగ్రి అవసరాలను తీర్చడానికి విద్యా బ్యాంకును నిర్వహించారు. గాంధీ, నెహ్రూ వేషధారణలతో శరణ్య, రాజు ఆకట్టుకున్నారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యా బ్యాంకును ప్రారంభించారు. హెచ్ఎం శ్యామ్ మాట్లాడుతూ జిల్లాలో పది పాఠశాలలో విద్యా బ్యాంకు ఏర్పాటు చేసినట్టు తద్వారా విద్యార్థులకు కావల్సిన పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ వంటివి ఉచితంగా అందజేస్తామన్నారు.

దంగేరు ఉన్నత పాఠశాలలో...

కె.గంగవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని దంగేరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. దివంగత జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి వక్తలు నివాళులర్పించారు. పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న అయేషా నెహ్రూ వేషధారణలో అలరించింది.

కపిలేశ్వరపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎంఈవో కె.తాతారావు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈవోతో పాటు, పాఠశాల హెచ్ఎం చిట్టూరి వెంకట శ్రీధర్ బాలల దినోత్సవం ప్రాముఖ్యత, నెహ్రూ జీవిత చరిత్రపై విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు నెహ్రూ బాటలో నడవాలని సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, బాలనెహ్రూ వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాణిక్యాంబ, రామతులసి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో...

ద్రాక్షారామ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం మండల పరిషత్ ఆదర్శ పాఠశాలలో శుక్రవారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆకట్టుకున్న స్క్రీన్‌ట్రాప్ ప్రదర్శన: బాలల ప్రదర్శన సందేశాత్మకంగా నిలిచింది. సే టు నో స్మార్ట్‌ఫోన్, సేవ్ చైల్డ్ హుడ్ ఫ్రం స్క్రీన్ ట్రాప్ అంటూ ఇద్దరు చిన్నారులు ప్లకార్డులు ప్రదర్శించగా మరొక బాలుడు ఫోన్ స్క్రీన్‌లో ముఖం పెట్టి చూస్తూ ప్రదర్శన ఆలోచింపచేసింది. నెహ్రూ వేషధారణలో బాలుడు ఆకట్టుకున్నాడు. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని వనభోజనాలు పెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.దుర్గాదేవి, కె.భీమశంకరం, పి.వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రావులపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వెదిరేశ్వరం జడ్పీ పాఠశాలలో హెచ్ఎం వి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత స్కూల్ ఛైర్మన్ ఎం.సుబ్బాయమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. రావులపాలేనికి చెందిన కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు 20 మంది విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేశారు. రావులపాడు జడ్పీ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జేఏసీ సెక్రటరీ జనరల్ బీవీ రాఘవులు పాల్గొన్నారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బ్యాంక్ ఆఫ్ బరోడా సహకారంతో బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్.మధుసూదనరావు, పీడీ గిరి, జి.సునీత, జ్యోతిబసు, కేవీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూకు నివాళి

రాయవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పసలపూడి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు. స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో తొలుత దివంగత నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విష్ణు కుమారి బాలల దినోత్సవం విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం చిన్నారులు, విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మెయిన్ స్కూల్ హెచ్ఎం కొరుమిల్లి వెంకటరమ, డి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మండపేట శారదా మున్సిపల్ పాఠశాలలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు



రామచంద్రపురం మండలం వెంకటాయపాలెం ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల వినూత్న ప్రదర్శన



కపిలేశ్వరపురం మండలం వల్లూరులో బాలల దినోత్సవంలో చిన్నారుల సందడి

పుస్తక పఠనంతో విజ్ఞానం మెండు

• గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమంలో వక్తలు • సందడి చేసిన విద్యార్థులు



కపిలేశ్వరపురంలో గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న దృశ్యం

ఆత్రేయపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను సర్పంచ్ గెడ్డం సుధ ప్రారంభించారు. గ్రంథాలయాధికారి నమ్మశివాయ, హెచ్ఎం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. పేరవరం శాఖా గ్రంథాలయంలో సర్పంచ్ గంటి విజయభారతి వారోత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ వి.కృష్ణారావు, ముళ్లపూడి సత్యనారాయణ తదితరులు పాల్గొని గ్రంథాలయ ప్రాముఖ్యతను తెలిపారు. గ్రంథాలయాధికారిణి శ్రీదేవి నిర్మల పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

కొత్తపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు ఆలయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపేట గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ శుక్రవారం నుంచి 21 వరకూ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, లైబ్రేరియన్ కుంచే సునీత, సి.నాగేశ్వరరావు, వాసంశెట్టి సత్యనారాయణ, యెలిశెట్టి ప్రభాకర్, తమ్మన సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మండపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండపేట కేపీ రోడ్డులో వున్న గ్రంథాలయంలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. వారం రోజులపాటు జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జవహర్‌లాల్‌నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వహణ అధికారి పూర్ణమ్మ, ఉపాధ్యాయులు శ్రీనివాస్, ప్రసాద్ జి.అనురాధ, కే.పద్మజ, గణేష్, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో..

రావులపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ యు.రమేష్‌బాబు అధ్యక్షతన గ్రంథాలయాధికారి ఎస్.అరుణకుమార్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను కళాశాలల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతంశెట్టి కనికిరెడ్డి పుస్తక ప్రదర్శనను ఆవిష్కరించారు. తొలుత గ్రంథాలయ పితామహుడు ఎస్ఆర్ రంగానాథన్ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. అభివృద్ధి కమిటీ సెక్రటరీ ఎం.నరేష్‌రెడ్డి, మెంబర్ జక్కంపూడి రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానవంతులు కావాలి

కపిలేశ్వరపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనంతో విజ్ఞానవంతులు కావాలని సర్పంచ్ సాకా శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కపిలేశ్వరపురం శాఖా గ్రంథాలయంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో భానూజీరావు, మాజీ వైస్ ఎంపీపీ నెక్కంటి శ్రీరాంజీ, హెచ్ఎం వి.శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీవో వరప్రసాద్, రిటైర్డ్ టీచర్ సీహెచ్ సత్యనారాయణ బీజేపీ నాయకులు నామాల శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. ఈనెల 14వ తేదీ నుంచి 20 వరకు జరిగే గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ తదితర పోటీలు నిర్వహించి విజేతలకు ముగింపు రోజున బహుమతులు ఇవ్వనున్నట్టు గ్రంథాలయాధికారిణి డి.శివకుమారి తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ, సీహెచ్ నాగేంద్రప్రసాద్, పాస్టర్ ఏసురత్నం, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ వారోత్సవాలను ఇంగ్లీషు అధ్యాపకుడు శివ ప్రారంభించారు. ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించనున్న వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, వక్తృత్వం పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి ఎంవీ సూరిబాబు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రావులపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గోపాలపురం సచివాలయం-2 వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనపర్తి నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ కోతలు మొదలైన నేపథ్యంలో రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బితి మోహనరావు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు అధికారి నాగేశ్వరరావు, ఏవో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బీహార్‌లో కూటమి విజయంపై హర్షాతిరేకాలు

ద్రాక్షారామ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఎన్‌డీఏ విజయంతో ద్రాక్షారామలో ఆ పార్టీ నాయకులు విజయోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ రామచంద్రపురం మండల అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, మండల ఆత్మనిర్భర్ భారత్ కన్వీనర్, హసన్‌బాద గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు వాడ్రేవు వెంకట్రావు, ద్రాక్షారామ పీఏసీఎస్ త్రిమన్ కమిటీ సభ్యుడు అల్లం రామకృష్ణ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా స్వీట్లు పంపిణీ చేసి బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పుల్లెల రామ్మూర్తి, చింతా సత్యనారాయణ, ఆళ్ల బుజ్జి, డి.ఓం ప్రకాష్, ఇంధన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురంలో: బీహార్‌లో ఎన్‌డీఏ విజయం పట్ల రామచంద్రపురంలో హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకుడు ఇళ్ల వెంకటేశ్వరరావు స్వీట్లు పంపిణీ చేశారు.



ద్రాక్షారామలో ఎన్‌డీఏ విజయోత్సవాన్ని నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ముగిసిన క్రీడోత్సవాలు

మండపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండపేట పబ్లిక్ స్కూల్‌లో జరుగుతున్న క్రీడోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పాఠశాల డైరెక్టర్ వల్లూరి చిన్నారావు సారధ్యంలో జరిగిన కార్యక్రమానికి మండపేట మండల విద్యాధికారి 2 చింతా సోమిరెడ్డి హాజరయ్యారు. ఎంపీఎస్ ఆధ్వర్యంలో జరిగిన క్రీడా ఉత్సవాల్లో విజేతలకు ఆయన చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేటలో పలు కార్యాలయాలు ప్రారంభం

కొత్తపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. స్థానిక బ్యాంక్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన ప్రారంభించారు. జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా నిర్మించిన అదనపు సౌకర్యాలను ప్రారంభించారు. కొత్తపేట పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్మించిన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, సర్పంచ్ బూసి జయలక్ష్మి, యల్లమిల్లి చంద్రకుమారి, ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, మిద్దే ఆదినారాయణ, కంఠంశెట్టి శ్రీనివాస్, ఆర్డీవో పి.శ్రీకర్, తహశీల్దారు వై.రాంబాబు, ఎంపీడీవో నరేష్‌కుమార్, డీఎల్‌డీవో రాజేశ్వరరావు, గనిశెట్టి వీరేష్, పాలూరి సత్యానందం పాల్గొన్నారు.

నేడు వెదురుపాకలో సత్యదేవుడి వ్రతాలు

రాయవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గ్రామంలో కార్తీక మాసం ఏకాదశి సందర్భంగా శనివారం సామూహిక సత్యదేవుడి వ్రతాలు నిర్వహించనున్నట్టు గీతా మందిరం నిర్వాహకుడు సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ స్థానిక సత్యనారాయణస్వామి ఆలయం వద్ద సామూహిక సత్యదేవుడి వ్రతాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పి.శివమణికంఠరెడ్డి, గీతా మందిర భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

కొత్తపేట ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.

గుండెపోటుతో న్యాయవాది మృతి

మండపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) మండపేటకు చెందిన న్యాయవాది వి.రామ్మోహన్ కుమార్(60) గురువారం అర్ధరాత్రి గుండెపోటుకు గురై ఇంటి వద్ద మృతి చెందారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. ఈయన గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. ఈయన మృతికి స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బిక్కిన కృష్ణార్జున చౌదరి, రెడ్డి రాధాకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, బీజేపీ నాయకుడు కోనా సత్యనారాయణ తదితరులు సంతాపం తెలిపారు. సహచర న్యాయవాదులు, అభిమానులు సంతాపం తెలిపిన వారిలో వున్నారు.

బీహార్‌లో ఎన్డీఏ విజయంపై సంబరాలు

కొత్తపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ విజయం సాధించడంపై కొత్తపేటలో బీజేపీ యువమోర్చ నాయకుడు కోటిపల్లి దామోదర్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు విజయోత్సవాన్ని నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్లో బాణసంచా కాల్చి స్వీట్స్ పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం మాట్లాడుతూ బీహార్ ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వానికి పట్టం గట్టారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాలాటి మాధవస్వామి, అన్యం సత్యనారాయణ, కె.రఘురామ్, అజ్జరపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బీహార్‌లో ఎన్‌డీఏ విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం ఆత్రేయపురంలో బీజేపీ శ్రేణులు విజయోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ నాయకులు శిష్టా సూర్యకుటుంబరావు, చేకూరి రమేష్‌వర్మ, చెంపాటి అనిల్‌కృష్ణవర్మ ఆధ్వర్యంలో మిఠాయిలు పంపిణీ చేసి విజయోత్సవాన్ని నిర్వహించారు.





ఆత్రేయపురంలో స్వీట్స్ అందజేస్తున్న బీజేపీ శ్రేణులు. పక్క చిత్రంలో రాయవరంలో మిఠాయిలు పంచి పెడుతున్న బీజేపీ నాయకులు

రాయవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ విజయం సాధించడంపై బీజేపీ నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. రాయవరంలో బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాట్రాతి జానకి రాంబాబు మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పట్టారన్నారు. బీహార్‌లో ఎన్‌డీఏ విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ నాయకులు మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిరట్ల సుబ్బారావు, నరాల రాంబాబు, అంగర జనార్ధన స్వామి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ పటిష్టతకు పనిచేయాలి



ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గంలో నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు పార్టీ పటిష్టతకు అంకిత భావంతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. టీడీపీ పట్టణ కార్యాలయంలో శుక్రవారం కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. తొలుత నియమితులైన కమిటీ సభ్యులనుద్దేశించి ఎమ్మెల్యే పలు అంశాలు తెలిపారు. నియోజకవర్గంలోని మండపేట రూరల్, అర్బన్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాల కమిటీలతో పాటు పట్టణ, గ్రామ కమిటీలతో ఆయన ప్రమాణం చేయించారు. ముందుగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నూతన కమిటీలకు చెందిన సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవిడిలో లక్షపత్రి పూజ

కొత్తపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అవిడి గ్రామంలో పార్వతీ కైలేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్షబిల్వార్చన పూజలను నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం స్థానిక కమ్మిరెడ్డిపాలెం తాళ్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద జరిగిన వనసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, రెడ్డి రామకృష్ణ, సురవరపు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మధుమేహంపై అవగాహన ర్యాలీ

కపిలేశ్వరపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం మధుమేహ వ్యాధిపై అవగాహన ర్యాలీ, సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైద్యాధికారి రత్నకుమారి పలు అంశాలపై మాట్లాడారు. మధుమేహాన్ని అదుపులో ఉంచుకోకపోతే అనేక ఆరోగ్య సమస్యలు దారితీయవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెచ్ఈవో రామారావు, హెచ్‌వీ మేరీమణి, సూపర్‌వైజర్ నానిబాబు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీహెచ్ఈవో మల్లిఖార్జునుడు

స్వామిత్వ సభలను సద్వినియోగం చేసుకోండి

ఆత్రేయపురం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వెలచేరు పంచాయతీ వద్ద శుక్రవారం స్వామిత్వ గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీవో వెంకటరామన్ పాల్గొని స్వామిత్వ యోజన లక్ష్యాలు, భూయజమన్య హక్కుల ప్రాధాన్యతపై ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వి.శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కె.గంగవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): స్వామిత్వ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్ అన్నారు. శుక్రవారం సత్యవాడలో జరిగిన స్వామిత్వ గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో స్వామిత్వ సర్వేలో ఖాళీ స్థలాలు గుర్తించారు. వీటికి సంబంధించిన రికార్డులు ఉంటే స్థల యజమానులు పంచాయతీ సిబ్బందికి చూపించాలని ఎంపీడీవో ఎన్. శ్రీనివాస్ సభలో వెల్లడించారు. ఈ సభకు గ్రామ ఉప సర్పంచ్ సలాది శ్రీను అధ్యక్షత వహించారు. గ్రామ కార్యదర్శి సూర్య గౌతమి, విఆర్‌వో వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కె.గంగవరం: సత్యవాడ సభలో మాట్లాడుతున్న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్



విరాళం ఇచ్చిన దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం వివిధ ప్రాంత్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. శుక్రవారం సందర్భంగా ఆలయంలో మహిళలు భక్తి శ్రద్ధలతో దీపాలంకరణ గావించారు. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి నిడదవోలుకు చెందిన పసుపులేటి హరివెంకట రామప్రసాద్ కుటుంబ సభ్యులు రూ.43వేలు విరాళం ఇచ్చారు. ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉన్నతి రుణాల చెల్లింపు సొమ్ముల దుర్వినియోగంపై విచారణ



విచారణ నిర్వహిస్తున్న అధికారుల బృందం

రాయవరం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): డ్వాకా సభ్యులు తీసుకున్న ఉన్నతి రుణాలు చెల్లించినప్పటికీ బ్యాంక్‌లో జమ చేయకుండా సొమ్ములు దుర్వినియోగం చేసినట్టు వైదేహి గ్రూపు సభ్యులు యానిమేటర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విదితమే. వైదేహి గ్రూపు అధ్యక్షురాలు కచ్చా శ్రావణి ఇటీవల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బాధితుల ఫిర్యాదుపై శుక్రవారం రాయవరం వెలు గు కార్యాలయంలో అధికారుల బృందం విచారణ జరిపారు. స్త్రీనిధి జిల్లా మేనేజర్ సురేంద్ర, స్త్రీనిధి ఏజీఎం హేమలత, డీఆర్‌డీఏ ఏపీడీ ఆదియ్య తదితరుల బృందం వెలుగు కార్యాలయంలో ఆయా రికార్డులను పరిశీలించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న యానిమేటర్‌తో పాటు సీసీ నాజర్‌ను, ఫిర్యాదు చేసిన గ్రూప్ సభ్యులను వారు విచారించారు. అనంతరం మాచవరం గ్రామానికి వెళ్లి డ్వాక్రా మహిళలను విచారించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీయం కె.నాగేశ్వరరావు, ఉన్నతి ఏపీయం రవికిరణ్, ఎల్‌సీ రవిరాజా తదితరులు పాల్గొన్నారు.